PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 239 | విజయవాడ, ఆదివారం 2 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 2 April 2023 | Rs

అట్టుడికిన పుట్టపర్తి

- టిడిపి, వైసిపి శ్రేణుల బాహాబాహీ
- సవాళ్లు ప్రతి సవాళ్లతో ఉద్రిక్తత
- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అరెస్టు

● లోపలి పేజీలో.. ●

పంజాబ్‌ను గెలిపించిన వరుణుడు

- డిఆర్ఎస్‌లో కోల్‌కతాపై ఏడు పరుగుల తేడాతో విజయం

విజయన్‌తో కలిసి వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభిస్తున్న స్టాలిన్

వైకోమ్ సత్యాగ్రహ స్ఫూర్తితో

కుల రక్కసిపై పోరు

- శరీరాలే రెండు, మా ఆలోచన ఒక్కటే
- విజయన్‌తో కలిసి వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభిస్తూ స్టాలిన్

వైకోమ్ : అంటరాని తనంపై తిరుగుబాటుకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాలను కేరళముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శనివారం నాడిక్కడ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ,'నేను, పినరయి విజయన్ పుట్టుకతో ఇద్దరే అయినా ఆలోచనల్లో మాత్రం ఒక్కటే'అని అన్నారు.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా, తాను ఈ వేడుకలో పాల్గొనేందుకు వచ్చానంటే ఆ పోరాటంకేరళకే కాదు తమిళనాడుకు కూడా గొప్ప స్ఫూర్తినివ్వడమేనని ఆయన అన్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కలిసి వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవాలని' ఆయన ఆకాంక్షించారు. అలా వేడుకలు జరుపుకోవడాన్ని విజయన్ స్వాగతించారని స్టాలిన్ అన్నారు. తమిళ పిల్లల తరపున వైకోమ్ సత్యాగ్రహానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విస్తృతమైన కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని స్టాలిన్ ప్రశంసించారు ఎజవా, పులయాస్ వంటి నిమ్న కులాలపై అగ్రవర్ణాలు సాగించిన అమానుష వివక్షకు వ్యతిరేకంగా 1924 మార్చి 30న మొదలైన వైకోమ్ సత్యాగ్రహ ఉద్యమం దేశంలో అనేక ప్రాంతాల్లో కుల వివక్ష వ్యతిరేక పోరాటాలకు ఊపిరులూదిందని తెలిపారు. కొట్టాయంకు 29 కి.మీ దూరంలోని టెంపుల్ టౌన్ అయిన వైకోమ్ ఆనాడు ట్రావెంకోర్ సంస్థానంలో ఉండేది. తక్కువల కులాలవారిని నీచంగా చూడడమే కాదు, వారిని ఆలయాల్లో అడుగుపెట్టనిచ్చేవారు కాదు, ఆ ఛాయలకు కూడా వారిని రానిచ్చేవారు కాదు, అటువంటి అమానుషమైన వివక్ష ట్రావెంకోర్ సంస్థానంలో అమలు జరిగేది. ఈ సామాజిక దురాచారానికి వ్యతిరేకంగా నారాయణ గురు, అయ్యంకాళి, టికె మహదేవన్, పెరియార్ వంటి ఎందరో ప్రముఖ సంఘ సంస్కర్తలు ఉద్యమించారని స్టాలిన్ పేర్కొన్నారు. ఆ విధంగా వైకోమ్ ఈ రెండు ఇరుగుపొరుగు ద్రవిడ రాష్ట్రాలకు వారధిగా నిలిచిందని ఆయన కొనియాడారు..బూజుపట్టిన కుల, మతాచారాలను పునరుద్ధరించేందుకు ఫ్యూడల్, నిరంకుశత్వ, మనువాద శక్తులు ప్రయత్నిస్తున్న నేటి పరిస్థితుల్లో వైకోమ్ సత్యాగ్రహం మిగతా 5లో

ఎండలు మండుతాయ్!

- సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- వాతావరణ విభాగం హెచ్చరిక

న్యూఢిల్లీ : ఈసారి వేసవి కాలం బాగా వేడిగా వుండబోతోందని, ఎండలు మండుతాయని, సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలే నమోదు అవుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) శనివారం తెలిపింది. వాయవ్య, ద్వీపకల్ప ప్రాంతాల్లో మినహా దేశంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంటుందని పేర్కొంది. ఏప్రిల్ నుండి జూన్ వరకు ఈ పరిస్థితి నెలకొంటుందని తెలిపింది. వాయవ్య, మధ్య, ద్వీపకల్ప ప్రాంతాల్లో చాలావరకు సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం వుండనుంది. తూర్పు, ఈశాన్య భారతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం వుంటుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో మధ్య, తూర్పు, వాయవ్య భారతాల్లో చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా ఎక్కువ స్థాయిలో వడగాడ్పులు వుంటాయని ఐఎండి పేర్కొంది. బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, హర్యానాల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వీడియో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలిపారు. ఈ ఏడాది వేసవి కాలం (ఏప్రిల్-జూన్)లో దేశంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు, వాయవ్య, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో సాధారణం నుంచి తక్కువ ఉష్ణోగ్రతలు వుండే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో సాధారణ వర్షపాతం వుంటుందని భావిస్తున్నట్లు తెలిపారు.

ఆహార దిగుబడుల గ్రాఫ్ కిందికి

- రెండు, మూడు అంచనాల మధ్య గ్యాప్
- తుది అంచనాల్లో మరింత తగ్గే సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్రంలో 2022-23 ఏడాదిలో ఆహారధాన్యాల ఉత్పత్తి గ్రాఫ్ నేల చూపులు చూస్తోంది. ఖరీఫ్, రబీ కలుపుకొని 169.30 లక్షల టన్నుల దిగుబడులొస్తాని మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు వ్యవసాయ బడ్జెట్‌తో పాటు సాధారణ బడ్జెట్‌లోనూ, సామాజిక, ఆర్థిక సర్వేలో సైతం ఇవే అంకెలు పేర్చారు. ఆ గణాంకాలు పంట ఉత్పత్తులపై ప్రభుత్వ రెండవ ముందస్తు అంచనాలు. తాజాగా వెలువడిన మూడవ ముందస్తు అంచనాల్లో ఆహారధాన్యాల దిగుబడులు 166.53 లక్షల టన్నులకు తగ్గిపోయాయి. రెండవ అంచనాల కంటే 2.77 లక్షల టన్నులు కుదించారు. ఆహార పంటల్లో ప్రధానమైన వరి ధాన్యం దిగుబడి కూడా కిందికే చూపించారు. రెండవ అంచనాల్లో ధాన్యం ఉత్పత్తి 133.65 లక్షల టన్నులు కాగా మూడవ అంచనాల్లో 129.04 లక్షల టన్నులకు పడిపోయింది. సాగు విస్తీర్ణం తగ్గుదల, తుపాన్లు, అకాల వర్షాలు, వరదల వలన దిగుబడులు తగ్గుతున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాతావరణ పరిస్థితులతో పాటు తెగుళ్ల వలన మిర్చి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ ఉత్పాదకత తగ్గింది. ఆ మేరకు రైతులు నష్టాలు చవిచూశారు.

పెద్ద వ్యత్యాసం

రెండు, మూడు అంచనాల మధ్య ఏరియా, ఉత్పత్తి, ఉత్పాదకత నడుమ పెద్ద వ్యత్యాసం కనిపిస్తోంది. వరి సాగులో 72 వేల ఎకరాలు తగ్గగా, ఉత్పత్తి 4.61 లక్షల టన్నులు తగ్గింది. ఉత్పాదకత ఎకరాకు 52 కిలోలు తగ్గింది. పప్పుధాన్యాల ఏరియా 4.52 లక్షల ఎకరాలు తగ్గగా, ఉత్పత్తి 1.57 లక్షల టన్నులు తగ్గించారు. మొత్తం ఆహారధాన్యాల ఏరియా 5.17 లక్షల ఎకరాలు తగ్గింది. ఉత్పత్తి 2.77 లక్షల టన్నులకు కోత పడింది. వేరుశనగ సాగు 5 వేల ఎకరాలు పెరగ్గా, ఉత్పత్తి 27 వేల టన్నులు తగ్గింది. ఉత్పాదకత 19 కిలోలు తగ్గించారు. మొత్తం నూనెగింజల సాగు 60 వేలు పెరగ్గా, ఉత్పత్తి 3.76 లక్షల టన్నులు పెరిగింది. పత్తి ఏరియా 10 వేల ఎకరాలు పెరగ్గా, దిగుబడి 3.05 లక్షల బేళ్లు తగ్గింది. ఉత్పాదకత 30 కిలోలు తగ్గింది. మిర్చి సాగు 8 వేల ఎకరాలు పెరగ్గా, ఉత్పత్తి 1.78 లక్షల టన్నులు తగ్గింది. ఉత్పాదకత ఎకరాకు 325 కిలోల మేర తగ్గింది.

చివరాఖరికి...

జనవరిలో వేసిన రెండవ ఎస్టిమేషన్‌కు, మార్చి నాల్గవ వారంలో వేసిన మూడవ అంచనాలకు మధ్య ఏరియా, ఉత్పత్తి, ఉత్పాదకత మధ్య పెద్ద తేడా వచ్చింది. జూన్ తర్వాత వేసే తుది అంచనాల్లో ఇంకా దిగుబడులు తగ్గుతాయని భావిస్తున్నారు. నిరుడు మూడవ అంచనాల్లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 171.70 లక్షల టన్నులుగా అంచనా వేయగా, ఫైనల్‌కొచ్చేసరికి 154.85 లక్షల టన్నులకు పడిపోయింది. అలాగే వరి ధాన్యం ఉత్పత్తి 133.53 లక్షల టన్నులనగా చివరికొచ్చేసరికి 121.16 లక్షల టన్నులకు దిగజారింది. ఈ తడవ ఖరీఫ్ నార్మల్‌లో నాలుగున్నర లక్షల ఎకరాల్లో ఆహార పంటలు సాగు కాలేదు. రబీలో పది లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. ఈదృష్ట్యా మూడవ అంచనాల్లో ఆహారధాన్యాల ఉత్పత్తి కంటే చివరాఖరుకొచ్చేసరికి బాగా తగ్గే సూచనలే కనిపిస్తున్నాయి.

ముందస్తు అంచనాలు (లక్షల టన్నులు)

పంట	రెండవ అంచనా	మూడవ అంచనా
వరి	133.65	129.09
పప్పుధాన్యాలు	11.48	9.95
ఆహారధాన్యాలు	169.30	166.53
వేరుశనగ	5.69	5.42
నూనెగింజలు	24.56	28.32
మిర్చి	9.45	7.67
పత్తి (లక్షల బేళ్లు)	18.84	15.79

అకాల వర్షం.. అపార నష్టం

ఏలూరు, ప్రకాశం, విజయనగరంలో దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం ఏలూరు, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు పడ్డాయి. మొక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. మామిడి పంట నేలరాలింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఏలూరు జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండవల్లి మండలంలో అరగంటపాటు కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పోలవరం మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కళ్లాల్లో ఉన్న మొక్కజొన్న తడిసి పోయింది. నూజివీడు మండలంలో ఈదురుగాలులకు మామిడి పంటకు భారీ నష్టం వాటిల్లింది. హనుమంతులగూడెం, మిట్టగూడెం, అన్నవరం, వెంకటాద్రిపురం, దిగవల్లి గ్రామాల్లో మామిడి నేలరాలింది. మొక్కజొన్న ఇతర కూరగాయల పంటలకూ తీవ్రమైన నష్టం వాటిల్లింది. పెదపాడు, ఏలూరు పట్టణం, రూరల్, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కామవరపుకోట, లింగపాలెం, చింతలపూడి, ముసునూరు, చాట్రాయి తదితర మండలాల్లో విస్తారంగా వర్షం కురిసింది. ప్రకాశం జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రకాశం జిల్లా దర్శిలో కాటేరు వాగు పొంగిపొర్లింది. ముండ్లమూరు మండలం గ్రామాల్లోని మిర్చి తడిచి ముద్దయ్యింది. మిర్చిని కాపాడుకోవడానికి రైతులు పట్టలు కప్పినా తడిచిందని రైతులు వాపోయారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలు చోట్ల ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. సీతంపేట, పాలకొండలో భారీ వర్షం పడింది. బొబ్బిలిలో ఈదురుగాలులకు విద్యుత్ వైర్లపై తాటిచెట్టు పడడంతో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగింది. వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. తిరుపతిలో చిరుజల్లులు పడ్డాయి.

ప్రకాశం జిల్లా ముండ్లమూరులో మిర్చి తడవకుండా పట్టలు కప్పుతున్న మహిళలు

రూ.18 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : దేశంలో పన్ను వసూళ్లు రాకెట్‌లా దూసుకెళ్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో 22 శాతం వృద్ధితో రూ.18 లక్షల కోట్ల వస్తు సేవల పన్నులు (జిఎస్‌టి) వసూళ్లయ్యాయని శనివారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రతీ నెల సగటున రూ.1.51 లక్ష కోట్ల చొప్పున వసూళ్లయ్యాయి. " 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో నెలకు సగటున రూ.1.55 లక్షల కోట్లు, ఇంతక్రితం డిసెంబర్ త్రైమాసికంలో నెలకు రూ.1.51 లక్షల కోట్లు, తొలి, ద్వితీయ త్రైమాసికాల్లో నెలకు సగటున వరుసగా రూ.1.46 లక్షల కోట్లు, రూ.1.49 లక్షల కోట్లు చొప్పున వసూళ్లు జరిగాయి." అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. గడిచిన మార్చి నెలలో జిఎస్‌టి వసూళు 13 శాతం పెరిగి రూ.1.60,122 కోట్లుగా చోటు చేసుకున్నాయి.

ఇప్పటివరకు వసూలైన జిఎస్‌టిలో ఇది రెండో అత్యధికం. ఏప్రిల్ 2022లో అత్యధికంగా రూ.1.68లక్షల కోట్ల జిఎస్‌టి వసూలై ఆల్‌టైం రికార్డుగా ఉంది. 2022-23లో నాలుగు సార్లు రూ.1.5 లక్షల కోట్ల మార్క్ వసూళ్లు నమోదయ్యాయి. క్రితం మాసం వసూళ్లలో సిజిఎస్‌టి కింద రూ.29,546 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.37,314 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.82,907 కోట్లు, సెస్సుల రూపంలో రూ.10,355 కోట్లు చొప్పున రాబడి చోటు చేసుకుంది.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం ఉధృతం

- ప్రయివేటీకరణపై కేంద్రం వెనక్కి తగ్గే వరకూ పోరాటం
- ప్రతినబూనిన అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు
- 'ఉక్కు' దీక్షలకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పలు జిల్లాల్లో ఆందోళనలు

విశాఖ నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నేతలు, ప్రజలు

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు తేల్చి చెప్పారు. ప్రజల సహకారంతో ఈ ఉద్యమాన్ని ముమ్ముందు మరింత ఉధృతం చేస్తామని ప్రతినబూనారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తోన్న రిలే దీక్షలకు శనివారానికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో విశాఖలోనూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. విశాఖలో జెఎసి ఆధ్వర్యాన దీక్షా శిబిరం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల గురజాడ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించి అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు పడాల రమణ, భోగవిల్లి నాగభూషణం అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి విల్లా రామ్మోహన్ కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి దొమ్మేటి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ జిల్లాలోని కార్మిక వర్గాన్ని, ప్రజలను సమీకరించి ఉద్యమం నిర్వహిస్తోన్న జెఎసిని అభినందించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు చేస్తోన్న పోరాటం వథా కాలేదని, రెండు సంవత్సరాలు పూర్తయినా మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంలో మిగతా 2లో

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ ఐవి

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు అప్పారి వెంకటస్వామి, నాగటి నారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారికి ఘనంగా నివాళులర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి స్మారకోపన్యాసంలో ఉద్యమాలు-సవాళ్లు అనే అంశంపై ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడారు. అప్పారి వెంకటస్వామి ఎన్నో నిర్బంధాలను, సవాళ్లను ఎదుర్కొని ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి ప్రభుత్వం ఏ సమస్యనూ పరిష్కరించడం లేదని విమర్శించారు. ప్రశ్నించే వారిపట్ల అణచివేత ధోరణినిరాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తూ.. ఉద్యమాలపై పోలీస్ నిర్బంధాలను ప్రయోగిస్తోందన్నారు. అప్పారి వెంకటస్వామి స్ఫూర్తితో నిర్బంధాలను ఎదుర్కొని బలమైన ఉపాధ్యాయ ఉద్యమాలను నిర్మించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. ప్రజల, ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజాభిప్రాయాలకు భిన్నంగా వెళ్లే ఈ ప్రభుత్వాలు పతనంకాక తప్పదని హెచ్చరించారు. ఉద్యమాలే ఊపిరిగా యుటిఎఫ్ ఎదిగిందని, అప్పారి వెంకటస్వామి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బలమైన ఉద్యమాలను నిర్మించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విద్యారంగ పరిరక్షణ కోసం బలమైన పోరాటాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి బాబురెడ్డి, ఎం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, సహ అధ్యక్షులు కె సురేష్‌కుమార్, ఎ నాగకుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శులు మిగతా 5లో

తుళ్లూరు ఘటనలో వైసిపి కార్యకర్త అరెస్టు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సమీపంలో శుక్రవారం సాయంత్రం బిజెపి కాన్వాయ్‌పై రాయితో దాడి చేసిన వైసిపి కార్యకర్త దున్నా నితిన్ (23)ను అరెస్టు చేసి 41 ఎ కింద నోటీసు ఇచ్చామని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. ఎస్‌పి తన కార్యాలయంలో మీడియాతో శనివారం మాట్లాడారు. అమరావతికి మద్దతుగా మందడంలో జరిగిన 1200వ రోజు సభలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డికి నిరసన తెలిపేందుకు బిజెపి కాన్వాయ్‌ని వైసిపి కార్యకర్తలు అడ్డుకున్నారని చెప్పారు. వెనుక నాల్గో వాహనంపై నితిన్ రాయి విసిరాడని తెలిపారు. ఈ కాన్వాయ్‌లో బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఉన్నట్టు తమకు తెలియదని చెప్పారు.

మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డిపైనా కేసు నమోదు చేశామని ఎస్‌పి తెలిపారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై వైసిపి కార్యకర్తలు ఫిర్యాదు చేశారని ఆరీఫ్ హఫీజ్ చెప్పారు.

ఖాళీ స్థలం పన్ను కడితేనే రిజిస్ట్రేషన్

- రిజిస్ట్రార్లకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మెమో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రిజిస్ట్రేషన్లలో మార్పులు తీసుకొస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ ఐజి రామకృష్ణ శనివారం మెమో నెంబరు 1730463 జారీచేశారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో అప్పటి వరకూ ఖాళీ స్థలంగా ఉన్నప్పటికీ దానికి సంబంధించిన విఎల్‌టి (వేకెంట్ ల్యాండ్ టాక్స్) కడితేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అలా కట్టకుండా చేస్తే సబ్ రిజిస్ట్రార్లను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. గతంలో పాత డాక్యుమెంట్లు ఉంటే రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే నూతన పద్ధతిలో పాత డాక్యుమెంటుతోపాటు అంతకుముందు కట్టిన ఆస్తిపన్నుగానీ, ఖాళీస్థలమైతే దానిపన్నుగానీ జతచేయాల్సి ఉంటుంది. టిడిసిపి అనుమతి ఉంటే రిజిస్ట్రేషన్ జరిగేది. ఇప్పుడు ఖచ్చితంగా పట్టణ సంస్థల అనుమతి ఉన్న ప్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. భూమి స్థితిని మార్చుకున్నా దానికి సంబంధించి అనుమతి వచ్చిన తరువాతే రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉంటుంది. ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ సమయంలో అనుమతి పొందిన ప్లాను తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుంది. ఒక్క వీలునామాకు మినహా అన్ని తరహా రిజిస్ట్రేషన్లకు ఖచ్చితంగా విఎల్‌టి రశీదులు జత చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ భూమికైతే 1బి అడంగలును ఖచ్చితం చేశారు. గతంలో పాసు పుస్తకం, డాక్యుమెంటు అధారంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఇక ముందు 1బి అడంగలు తప్పనిసరి చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో పేరుతో రిజిస్ట్రేషన్ చేయడానికి వచ్చిన వ్యక్తి పేరు ఒకటే ఉండాలని నిబంధన పెట్టారు. తమిళనాడు ప్రభుత్వం చేసిన పద్ధతిలో దీన్ని అమలు చేస్తున్నామని మెమోలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ల చట్టం 1908లో సెక్షన్ 22బి కింద నూతన మార్పులు చేర్పులు చేసినట్లు స్పష్టం చేశారు. నూతన పద్ధతిలో అసెస్‌మెంట్ నెంబరు, విఎల్‌టి, పట్టణ సంస్థలో ప్లాను, డిటిసిపి అయితే ఐఇఎల్‌పి తప్పనిసరి చేశారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో వెబ్‌ల్యాండ్ రికార్డులో, పట్టాదారు పాసు పుస్తకంలో యజమాని పేరు స్పష్టంగా లేకపోతే దాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని తెలిపారు. ఒకవేళ అలా కాకుండా రిజిస్ట్రేసన్లు జరిగితే వాటిని రద్దు చేసే అధికారం ఉంటుందని పేర్కొన్నారు. రీసర్వే పూర్తి చేసిన ప్రాంతాల్లో ఎల్‌పిఎం నంబర్ల అధానంగా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. రెండో సారి అదే స్థలం రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే తహశీల్దార్ సదరు ఆస్తిని సబ్ డివిజన్ చేసిన తరువాతే వాటిని రిజిస్ట్రేషన్ కోసం అనుమతిస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లలో ఆస్తి ఒకటి కంటే ఎక్కువ మిగతా 2లో

అక్రిడిటేషన్ కమిటీల్లో ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలి

- ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసిన రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల్లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు డిమాండ్ చేశారు. జర్నలిస్టు సమస్యలపై నిరంతరం పనిచేస్తూ.. వేలాది మంది సభ్యులతో అన్ని జిల్లాల్లో కమిటీలను కలిగి వున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్రంలో పెద్ద సంఘంగా ఉందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత అక్రిడిటేషన్ కమిటీలతోపాటు ప్రభుత్వ పరంగా వుండే అన్ని కమిటీలలో ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం వుండేదని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై పని చేసే సంఘాలను కొత్తగా ఈ ప్రభుత్వం విడుదల చేసిన జిఓలలో విస్మరించడం తగదని పేర్కొన్నారు. తక్షణమే అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య వందేభారత్ రైలు

- 8న ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య రెండో వందేభారత్ రైలు పరుగు పెట్టనుంది. సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడిచే ఈ రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 8న సికింద్రాబాద్‌లో ప్రారంభిస్తారు. ప్రస్తుతం సికింద్రాబాద్-తిరుపతి మధ్యన నడుస్తున్న రైళ్లలో ప్రయాణ సమయం 12 గంటలకు పైగా పడుతోంది. వందేభారత్ రైలులో కేవలం 8.30 గంటల్లో సికాంద్రాబాద్ నుంచి తిరుపతి చేరుకోవచ్చు. నాలుగు గంటలకుపైగా సమయం కలిసివస్తోంది. నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. ప్రారంభోత్సవం రోజున నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో వందేభారత్ రైలు ఆగుతుంది. అన్ని స్టేషన్లలో స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలకాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

వాల్తేరు రైల్వే డివిజన్ ఆల్ టైం రికార్డ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం కేంద్రంగా నిర్వహిస్తోన్న వాల్తేరు రైల్వే డివిజన్ 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో ఆల్ టైం రికార్డు నమోదు చేసింది. డివిజన్‌లోని అన్ని విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబర్చి చరిత్ర సృష్టించింది. లోడింగ్, ప్రయాణికుల తరలింపు, ఇంధన సంరక్షణ, క్యాటరింగ్, టికెట్ చెకింగ్, నాన్-ఫేర్ రాబడి, ఇతర ఆదాయాలు మొదలైన వాటిలో అత్యుత్తమ పనితీరు కనబరిచింది. వాల్తేరు డివిజన్ ద్వారా వివిధ ప్రాంతాలకు 69.63 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేశారు. 27.86 మిలియన్ల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చారు. తద్వారా రూ.9294 కోట్ల ఆదాయాన్ని వాల్తేరు రైల్వే డివిజన్ ఆర్జించింది. రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాలన్నింటినీ డివిజన్ అధిగమించింది. ఉద్యోగులు, కస్టమర్లు, వ్యాపార భాగస్వాములు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, కార్మిక సంఘాల సభ్యులు తమకు అన్ని విధాలా మద్దతునిచ్చినందుకు డిఆర్‌ఎం అనూప్ సత్పతి ధన్యవాదాలు తెలిపారు.

భావసారూప్యత గల పార్టీలతో కలిసి నడుస్తాం

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజల పక్షాన పోరాడుతోందని, భావసారూప్యత గల పార్టీలతో కలిసి ముందుకు వెళ్తామని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ఎదుట కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా రుద్రరాజు మాజీ ఎంపి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కెవిపి రామచంద్రరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు సేవ చేయడం మరిచిపోయాయని విమర్శించారు. పార్లమెంటులో ప్రశ్నలు వేస్తే రాహుల్ గాంధీని బయటకు వెళ్లేలా అనర్హత వేటు వేయడం కేంద్ర బిజెపి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మోడీ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి ఇన్‌ఛార్జి సిడి మెయ్యప్పన్, ఎమ్ క్రిస్టోఫర్ తిలక్, ఎఐసిసి కార్యదర్శి జెడి శీలం, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలపై పెనుభారాలు

మూడేళ్లలో 50 శాతం పెరిగిన పన్నులు

- ప్రజల ఎజెండాతో పాలక పార్టీలపై ఒత్తిడి
- రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమం
- పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంత ప్రజలపై కేంద్రం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం పన్నుల భారాన్ని మూడేళ్లలో 50 శాతం పెంచిందని, ఐదేళ్లలో 100 శాతానికి పెరుగుతుందని పట్టణ పౌర సమాఖ్య రాష్ట్ర కన్వీనరు సిహెచ్ బాబూరావు తెలిపారు. పెనుభారాలు మోపే ఈ చర్యలను ప్రజల ఎజెండాగా మార్చి ఈ ఏడాది కాలంపాటు ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. పట్టణ పౌర సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం విజయవాడలో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శనివారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబూరావు మీడియాకు వివరించారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో 1.50 కోట్ల మంది జీవిస్తున్నారని, వారందరికీ ఆస్తిపన్నులతోపాటు గ్యాస్, పెట్రోల్, సిమెంటు, చెత్తపన్ను, మంచినీటి పన్నులు వంటివి పెనుభారంగా మారాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలను పరిపాలనా కేంద్రాలుగా

కాకుండా పన్నులు వసూలు చేసే సంస్థలుగా మార్చేశాయని తెలిపారు. ఆస్తి విలువ అధారంగా పన్ను వసూలు చేయాలనే కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్రం తూచ తప్పకుండా అమలు చేస్తోందని విమర్శించారు. గతంలో 100కు 15 శాతం పెంచారని, రెండో ఏడాది 115 శాతంపై మరో 15 శాతం పెంచారని, ఇలా రెండేళ్లలో 32 శాతం పెరిగిందని పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ నుండి మరో 15 శాతం భారం విధించనున్నారని తెలిపారు. ఆస్తిపన్నుతోపాటు చెత్తపన్ను, మంచినీటి పన్ను వసూలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం చట్ట విరుద్ధమని, దాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. అమృత్ పథకంలో భాగంగా ఇళ్లకు నీటిమీటర్లు పెడుతున్నారని, ఇప్పటికే విజయవాడలో అమలు చేశారని తెలిపారు. ఇవేకాకుండా ఇళ్ల క్రమబద్ధీకరణ, సీలింగు, రెవెన్యూ, నాలా, ఒటిఎస్ వంటి రూపాల్లో పెనుభారం మోపుతున్నారని పేర్కొన్నారు. భారాలను పక్కదారి పట్టించేందుకు ఆస్తిపన్నులో వడ్డీ మాఫీ అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. 24 శాతం పెనాల్టీ విధించాలనే నిబంధనను మార్చి నామమాత్రపు పెనాల్టీలు ఉండేలా చూడాలన్నారు. ఇప్పటి వరకూ మున్సిపాలిటీల్లో రూ.1,995 కోట్లు ఆస్తిపన్ను వసూలైందని, గతేడాది రూ.1,412 కోట్లు మాత్రమేనని తెలిపారు. అంటే రూ.583 కోట్లు అదనపు భారం పడిందని వివరించారు.

దీంతోపాటు వేర్వేరు రూపాల్లో పన్నేతర ఆదాయం రూ.1,005 కోట్లు వచ్చిందని, చెత్తపన్ను రూపంలో 1.34 కోట్ల కుటుంబాల నుంచి రూ.112 కోట్లు అదనంగా వసూలు చేశారని పేర్కొన్నారు. పన్నుల వసూళ్ల మీద ఉన్న దృష్టి అభివృద్ధిపై లేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థలను నీరుగార్చారన్నారు. ప్రజలపై మోపుతున్న భారాల తీరుపై అధికారపార్టీ ప్రజాప్రతినిధులే ఎదురుతిరుగుతున్నారని వివరించారు. జగనన్న ఇళ్లు నత్తనడకన సాగుతున్నాయని, టిడ్కో ఇళ్లు ఇవ్వడం లేదని, కట్టిన ఇళ్లు పాడైపోతున్నాయని వివరించారు. వేసవిలో మంచినీటి ఎద్దడిని తీర్చే యాక్షన్ ప్లాన్ ఇంతవరకు రూపొందించలేదని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలనూ నెలనెలా మోపుతున్నారని తెలిపారు. వీటిపై పట్టణ పౌర సమాఖ్య ఆధ్వర్యాన క్షేత్రస్థాయిలో ప్రచారం, పోరాటం నిర్వహిస్తామని, అవసరమైతే న్యాయపరంగానూ పోరాడుతామని పేర్కొన్నారు.

సిపిఎం నాయకులు సుబ్బారావు కన్నుమూత

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావు (77) శనివారం రాత్రి ఏడు గంటలకు ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య మణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యునిగా సుబ్బారావు పనిచేశారు. సిఐటియు గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా పని చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా, గాజువాక ఆటో నగర్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఉన్నారు. గాజువాక ఆటో నగర్ కార్మికుల సమస్యలపై పలు పోరాటాలు నిర్వహించారు. బిహెచ్‌పివిలో ఓవైపు ఉద్యోగం చేస్తూ, మరోవైపు సిపిఎం విస్తరణకు కృషి చేశారు. పార్టీ చేపట్టిన భూపోరాటాలు, గాజువాక హౌస్ కమిటీ పోరాటంలో కీలకపాత్ర పోషించారు. గంగవరం పోర్టు నిర్వాసితుల సమస్యలపై ఉద్యమించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. షీలానగర్‌లో సుబ్బారావు మృతదేహం వద్ద సిపిఎం నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, రాజేంద్రప్రసాద్, కిరీటం, లోకేష్, పి.వెంకటరెడ్డి, సత్యవతి, డాక్టర్ రమేష్‌కుమార్ నివాళులర్పించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. సుబ్బారావు మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ సంతాపం తెలిపారు. ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.


జి.సుబ్బారావు (ఫైల్ ఫొటో)

పోలీసులే దొంగలుగా మారి..

- 105 కేజీల వెండి, రూ.2.05 లక్షల నగదు చోరీ
- నలుగురి అరెస్టు : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కంచె చేను మేసిన చందాన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీసులే దొంగలుగా మారారు. తప్పు చేసిన వారికి సంకెళ్లు వేయాల్సిన ఆ చేతులకు సంకెళ్లు తప్పలేదు. కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్ (రైటర్) తన బంధువులతో పాటు మరో కానిస్టేబుల్‌తో కలిసి 105 కేజీల వెండి, రూ.2 లక్షల 50 వేల నగదును తస్కరించిన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కర్నూలు జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం..కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ సిఐ విక్రమ్‌సింహా తన సిబ్బందితో కలిసి 2021 జనవరి 27న పంచలింగాల చెక్‌పోస్ట్ వద్ద తమిళనాడు రాష్ట్రం, సేలం టౌన్‌కు చెందిన సంధన్ భారతి గోవింద రాజ్ అనే నగల వ్యాపారి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో అతని వద్ద ఉన్న రూ.2,05,000 నగదు, 105 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ వారికి లెటర్ పంపగా, వారు వెండి వస్తువులకు సంబంధించిన బిల్స్‌ను వెరిఫై చేసి, రూ. 35,00,000 ఫైన్ వేశారు. వెండి వస్తువులు, నగదును పోలీస్ స్టేషన్‌ఫస్ట్ ఫ్లోర్‌లో భద్రపరిచారు. రైటర్ రమణబాబు ట్రాన్స్‌ఫర్ అయ్యాక, సదరు డబ్బును, వెండి వస్తువులను మహిళా రైటర్ అమరావతికి అప్పగించారు. ఎలాగైనా ఆ సొమ్మును, వెండి వస్తువులను దొంగిలించాలని అమరావతి నిశ్చయించుకున్నారు. అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేసేందుకు 2022 మే 24న స్టేషన్లో ఉన్న సిబ్బంది అంతా బయటకు వెళ్లారు. ఇదే అదనుగా అమరావతి, తన భర్త విజయ్ కుమార్‌తో కలిసి స్టేషన్‌లో ఉంచిన 105 కేజీల వెండి నగలను, రూ.రెండు లక్షల ఐదువేల నగదును దొంగలించారు. ఆ సొమ్మును ఎవరూ గుర్తు పట్టకోకుండా ఉండేందుకు గోల్డ్ షాపును నిర్వహించే ఆమె మరిది భరత్ సింహాకు అప్పగించి వెండివస్తువులను కరిగించి మార్పు చేయించారు. రమణ బాబును కూడా ఈ వ్యవహారంలో భాగస్వామిగా చేశారు. సొమ్ము కోసం యజమాని రావడంతో అసలు విషయం బయటపడింది. నిందితులు నలుగురికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.10 లక్షల నగదును, 81.52 కేజీల వెండిని సీజ్ చేశారు.

అమెరికా పెత్తనం ఇక చెల్లదు

- తాజాపరచిన రష్యన్ విదేశాంగ విధానం స్పష్టీకరణ

మాస్కో: అమెరికా ప్రపంచాధిపత్యాన్ని అంతమొందించడమే లక్ష్యంగా రష్యా కొత్త విదేశాంగ విధానం రూపుదిద్దుకుంది. ఈ నూతన వర్షన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ తన ఆమోదం తెలిపారు. బహుళ ధ్రువ ప్రపంచాన్ని నిర్మించాలంటే ప్రపంచ వ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యానికి చరమగీతం పాడాల్సిందేనని ఆ పత్రం పేర్కొంది. నయా ఉదారవాద, వలస పాలకుల ఆధిపత్యవాదాన్ని తిప్పికొట్టేందుకు అనువైన పరిస్థితిని సృష్టించేందుకు రష్యా ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ పత్రంవ పేర్కొంది. రష్యా వ్యతిరేక విధానాన్ని దూకుడుగా ముందుకు తెచ్చేందుకు అమెరికా కుతంత్రాలు మీద కుతంత్రాలు పన్నుతోంది.పశ్చిమ దేశాలను కూడగడుతుండడంతో రష్యా భద్రతకు అది ముప్పుగా పరిణమించే అవకాశముందని రష్యా భావిస్తున్నది. ప్రపంచ శాంతి, సమతుల్యతతో కూడిన మానవాళి పురోగతికి అమెరికాయే పెద్ద ప్రమాదకారి అని విదేశాంగ విధాన పత్రం పేర్కొంది. అమెరికా తన బలవంతపు ఆధిపత్యాన్ని వదులుకుని, దాని రష్యా వ్యతిరేక వైఖరిని మార్చుకోనంత కాలం ఆ దేశంతో సత్సంబంధాలకు ఆస్కారమే లేదని ఆ పత్రం స్పష్టం చేసింది. రష్యా-యూరప్ సంబంధాల సాధారణీకరణ గురించి ప్రస్తావిస్తూ, రష్యా, యూరప్ దేశాల ఆర్థిక పోటీతత్వాన్ని దెబ్బతీసి, యూరప్ దేశాల మధ్య చీలికలు తెచ్చి అమెరికా తన ప్రపంచ ఆధిపత్యానికి ఎదురు లేకుండా చూసుకోవాలన్న వ్యూహంతో ఉందని ఆ పత్రం పేర్కొంది. 2016 నాటి వెర్షన్ స్థానే తీసుకొచ్చిన ఈ తాజా వెర్షన్ వెంటనే అమలులోకి వస్తుందని రష్యా తెలిపింది.

ఆప్కో నిల్వలను వందశాతం కొనుగోలు చేస్తాం

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

ప్రజాశక్తి-మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఆప్కో చేనేత వస్త్ర నిల్వలను వంద శాతం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం 38వ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చేనేత కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో ఆప్కోను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. సొసైటీల్లో సమస్యలను తెలుసుకునేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేత కార్మికులకు కొంత వరకు ఉపాధి లభిస్తోందని, చెల్లింపులను మూడు నెలల కాలంలో చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొంభైకుపైగా ఆధునిక షోరూములు ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్ బార్‌కోడ్ ద్వారా ఆప్కో వ్యాపారం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. రానున్న కాలంలో ఆప్కోను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, చేనేత కళాకారులకు 365 రోజులు పని కల్పించేలా ముడి సరుకులు అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆప్కో ఎండి ఎంఎం నాయక్, అధికారులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో జగన్‌ను ఓడించడమే లక్ష్యం

- టచ్‌లో వైసిపి ఎమ్మెల్యేలు
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌ను అన్ని స్థానాల్లో ఓడించడమే తమ లక్ష్యమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. 175 స్థానాల్లో పోటీ చేస్తారా అనేది బుద్ధి లేని ప్రశ్న అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకే అర్హత లేని వ్యక్తి జగన్ అని విమర్శించారు. జగన్ రాష్ట్రాన్ని నాశనం చేసిన బిడ్డ అని వ్యాఖ్యానించారు. టిడిపి కార్యాలయంలో కొంతమంది విలేకరులతో ఇష్టాగోష్టిగా శనివారం ఆయన మాట్లాడారు. ఒకవైపు పన్నులు వేస్తూ.. మరోవైపు అప్పులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర అప్పు రూ.10.31 లక్షల కోట్లకు చేరిందని, రాష్ట్రాన్ని ఇలా అప్పులు పాలు చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. అప్పులు ఇంత చేసినా పోలవరం పూర్తి చేయలేదని, రాజధాని అమరావతిని నాశనం చేశారని, ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తిచేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపికి షాక్ ట్రీట్మెంట్ అని, వచ్చే ఎన్నికలు వైసిపికి పర్మినెంట్ ట్రీట్‌మెంట్ అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపై బాధ్యత తీసుకుంటానని చెప్పిన మంత్రి బొత్స సత్యనారాయణ రాజీనామా చేయాలి కాదా? అని అన్నారు. రాష్ట్రానికి సముద్ర తీరం ఉందని, మంచి భూములు ఉన్నాయని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుంటే 2029 నాటికి దేశంలో మొదటి స్థానంలో ఉంటామన్నారు. వైసిపి నుంచి కొంతమంది టిడిపిలోకి రావాలని ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంలో చాలా మందిని హోల్డ్‌లో పెట్టామన్నారు. తాను నిలబెట్టిన వారు గెలిస్తే మ్యానేజ్ చేసినట్లా? అని ప్రశ్నించారు. బుద్ధి ఉంటే పార్టీలో చేర్చుకున్న టిడిపి ఎమ్మెల్యేలను బయటకు పంపాలని అన్నారు. దేశ చరిత్రలో వివేకానందరెడ్డి హత్యకేసు అంతస్థాయిలో సంచలనమైన కేసు ఉందా? అని అన్నారు. ఈ కేసులో తులసమ్మ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై వాయిదా వాయిదాకు న్యాయవాదులను ఎలా మార్చుతున్నారని ప్రశ్నించారు. అధికార పార్టీ దౌర్జన్యాలకు గురువుతున్న ఎమ్మెల్యే శ్రీదేవికి అండగా ఉంటామన్నారు. వైసిపి దాడుల వెనుక వారి ఓటమి భారం, ఫ్రస్టేషన్ కనిపిస్తుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి వాహనం, టిడిపి కార్యకర్తలపై జరిపిన వైసిపి దాడులను ఖండిస్తున్నామని తెలిపారు.

పేపరు మిల్లులో కార్మికుని ఆత్మహత్య

- పరంపర స్కామ్‌తో బలవన్మరణం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎపి పేపరుమిల్లు యాజమాన్యం తమ స్వప్రయోజనాల కోసం చేపట్టిన పరంపర స్కామ్ కారణంగా శనివారం ఓ కార్మికుడు మృతి చెందారు. పేపరుమిల్లులోని స్టోర్‌లో పర్మినెంట్ కార్మికుడు ఎస్.సత్యనారాయణ (58) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు కారణాలను సూసైడ్ నోట్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. మిల్లులోని స్టోర్ డిపార్ట్‌మెంటులో రవణమ్మ అనే పర్మినెంట్ కార్మికురాలు తన ఉద్యోగాన్ని వీరబాబు అనే వ్యక్తికి అమ్మకం పెట్టుకుంది. అందుకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు యూనియన్ నాయకుని ముసుగులో ఉన్న ఓ వ్యక్తి ద్వారా సాగాయి. అదే సమయంలో రవణమ్మతోపాటు, సత్యనారాయణ

ఉన్నారు. పరంపర స్కామ్ బయటకు పొక్కడంతో ఆందోళనకు దారి తీసింది. పరంపర స్కామ్‌కు సంబంధించి కార్మిక సంఘాల నాయకత్వంలో పెద్ద ఎత్తున ఆందోళన సాగింది. కార్మిక సంఘాల ఆందోళనతో ఉద్యోగాల అమ్మకాల వ్యవహారం నిలిచిపోయింది. ఈ తరుణంలోనే రవణమ్మ ఉద్యోగం అమ్మకానికి సంబంధించిన లావాదేవీలు పూర్తయిన తరువాత ఆమె మృతి చెందారు. ఆమె ఉద్యోగాన్ని యూనియన్ నాయకునితో కలిసి డబ్బులు ఇచ్చి కొనుక్కున్న వీరబాబు లబోదిబోమన్నారు. అదే సమయంలో రవణమ్మతోపాటు వచ్చిన సత్యనారాయణను వీరబాబు నిలదీశారు. ఆమెతోపాటు నువ్వు వచ్చావని, ఆ డబ్బు నువ్వే ఇవ్వాలని నిలదీసినట్లు సమాచారం. వీరబాబు వేధింపులు అధికమవ్వడంతో తీవ్ర మనోవేదనతో సత్యనారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. సూసైడ్ నోట్‌లో రాసిన వివరాలు తెలియాల్సి ఉంది.

ఆత్మహత్య కాదు
పరంపర స్కామ్ హత్య : సిఐటియు

పేపర్ మిల్లులో కార్మికుడిది ఆత్మహత్య కాదని, స్కామ్ హత్య అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ అన్నారు. సిఐటియు పేపర్ మిల్లు వద్దకు వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరపాలి : ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పేపర్ మిల్లులో కార్మికుని ఆత్మహత్యపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని రాజనగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. పేపర్ మిల్లు వద్దకు చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్రమాలకు పాల్పడిన నాయకులు, యాజమాన్య ప్రతినిధులపై కూడా కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఫలితాలపై సమీక్షించుకుంటాం

- సత్యకుమార్‌పై దాడి మాకేం అవసరం
- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలపై సమీక్షించుకుంటామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దాడులకు పాల్పడే సంస్కృతి వైసిపికి లేదని, బిజెపి నాయకుడు సత్యకుమార్‌పై దాడి చేయాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి ఉద్యమాన్ని తన రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే చంద్రబాబు నడిపిస్తున్నారని విమర్శించారు. ఆ ఉద్యమంలో రైతులు గానీ, ప్రజలు గానీ లేరని, అంతా చంద్రబాబు బినామీలేనని అన్నారు. రూ.లక్షల కోట్ల ప్రజా ధనాన్ని అమరావతి గోతుల్లో వేయాలనేది చంద్రబాబు ఆలోచనైతే అభివృద్ధి అనేది అనేది అన్ని ప్రాంతాలకూ సమానంగా పంచాలనేది జగన్ ఆశయమని అన్నారు. తమ ప్రభుత్వం వికేంద్రీకరణ అజెండాతోనే ఎన్నికలకు పోతుందని తెలిపారు. ఐదేళ్లు అధికారంలో ఉండేందుకు ప్రజలు తమకు అవకాశం కల్పిస్తే.. మధ్యలో ఎన్నికలకు ఎందుకు పోతామన్నారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలనే ప్రచారం చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారమని విమర్శించారు.

ధర్మవరంలో చేనేత కార్మికురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న లోకేష్

నిత్యావసర ధరలు, పన్నులు తగ్గిస్తాం

- యువగళంలో నారా లోకేష్

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్ (సత్యసాయి జిల్లా)

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు, పన్నుల భారాన్ని తగ్గిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీనిచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శనివారం సత్యసాయి జిల్లా ధర్మవరం సమీపంలోని ప్యాదిండి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైంది. పాదయాత్ర ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ, ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీ, లక్ష్మీచెన్నకేశవపురం, సాయినగర్ మీదుగా కదిరి గేటు నుంచి మార్కెట్ యార్డు వరకు కొనసాగింది. ధర్మవరం పట్టణ సమీపంలోని టిడ్కో గృహాలను లోకేష్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల పథకాలను కట్ చేసే కటింగ్ మాస్టర్ జగన్ అని, అడ్డగోలు నిబంధనల ఫిటింగ్ మాస్టర్ జగన్‌రెడ్డి అంటూ మండిపడ్డారు. టిడిపి హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లకు వైసిపి రంగులు వేసుకున్నారని విమర్శించారు. ధర్మవరంలో నాలుగేళ్ల క్రితం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా శిథిలావస్థకు చేర్చారని, తన పాదయాత్రను చూసి తమ చేతకాని పాలనను.. కవర్ చేసుకోవడానికి టిడ్కో ఇళ్లకు కలర్ కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేకుండా పోయిందన్నారు. వైసిపి పాలనలో మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రావడం లేదని, తమ ప్రభుత్వం రాగానే స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, సవితమ్మ పాల్గొన్నారు. యాత్ర ధర్మవరం మార్కెట్ యార్డులోని విడిది కేంద్రానికి చేరుకుంది. ఆదివారం ధర్మవరం నుంచి యాత్ర ప్రారంభం కానుంది.

శరత్ చంద్రారెడ్డికి బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరబిందో శరత్ చంద్రారెడ్డికి బెయిల్ మంజూరైంది. తన భార్య కనికా రెడ్డి అనారోగ్య కారణంగా బెయిల్ కావాలని ఆయన వేసిన పిటిషన్ పై విచారించిన రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు, నాలుగు వారాల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆయన త్వరలోనే విడుదల కానున్నారు. మద్యం కుంభకోణం కేసులో శరత్ చంద్రారెడ్డి కీలక నిందితుడిగా ఉన్నారు. ఆయనకు చెందిన మూడు కంపెనీల ద్వారా రూ.64 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించినట్లు ఇడి పేర్కొంది. పూచీకత్తుతో పాటు కొన్ని షరతులు కూడా న్యాయస్థానం విధించినట్లుగా తెలుస్తోంది.2022 నవంబర్ 9న శరత్ చంద్రారెడ్డిని ఇడి అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఏడాది జనవరిలో ఆయన నాన్నమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు 14 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. గడువు ముగిసిన తరువాత తిరిగి ఆయన తీహార్ జైలుకు వెళ్లారు.

ఖాళీ స్థలం పన్ను కడితేనే రిజిస్ట్రేషన్

(మొదటిపేజీ తరువాయి)

ఎల్‌పిఎంలు ఉంటే వాటికి విడివిడిగానే ఎల్‌పిఎం జారీచేస్తామని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో ఇన్‌ప్రిన్సిపల్ లేఅవుట్ ప్యాటర్న్ నంబరు అధార్ జతచేయాలని తెలిపారు. బిల్డింగ్ ప్లాను కూడా డాక్యుమెంట్లో ఉన్న వ్యక్తుల పేరుతో ఖచ్చితంగా ఉండాలని అలా లేనివాటికి రిజిస్ట్రేషన్లు చేయడం సాధ్యం కాదని వివరించారు. రిజిస్ట్రార్ అన్ని డాక్యుమెంట్లు చూసి ఆమోదయోగ్యంగా ఉన్నాయని ధ్రువీకరించిన తరువాత మాత్రమే వాటిని రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. పట్టణ స్థానిక సంస్థల్లో ఖాళీ స్థలాలకు సంబంధించి రిజిస్టరింగ్ అధికారి ఎగ్జిక్యూటెంట్ లేదా డెవలపర్లు లేదా భూమి యజమాని పేరు విఎల్‌టి, లేఅవుట్ ప్లానులో సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తరువాతే రిజిస్ట్రార్ అనుమతి ఇవ్వాలని సూచించారు. ఆయా డాక్యుమెంట్లు అన్నీ స్థానిక సంస్థల ఎలాక్ట్రానిక్ డేటాతో సరిచూసుకోవాల్సి బాధ్యత కూడా రిజిస్ట్రార్లకే అప్పగించారు. లేఅవుట్ అనుమతి ఉన్నా లింక్ డాక్యుమెంట్లు సరైనవో కావో ధ్రువీకరించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ల సమయంలో ఎక్కడైనా తేడాలు కనిపిస్తే సబ్ రిజిస్ట్రార్లపై కఠిన చర్యలు తీసుకుంటామని రామకృష్ణ హెచ్చరించారు. వీటిపై సబ్ రిజిస్ట్రార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూమికి సంబంధించి మొదటి, రెండో పార్టీ అగ్రిమెంటు అయి డాక్యుమెంటు తీసుకొస్తే తాము రిజిస్ట్రేషన్ చేస్తామని, ఇప్పుడు అన్నీ తమనే ధ్రువీకరించుకోవాలని పెడుతున్నారని తెలిపారు. ఎవరైనా తప్పుడు వివరాలు నమోదు చేస్తే తమను శిక్షిస్తామనే విధంగా కొత్త నిబంధనలు ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకూ నకిలీ రిజిస్ట్రేషన్లు చేస్తే చేసినవారు, చేయించుకున్న వారిని నేరస్తులుగా పరిగణించేవారు. నూతన నిబంధనల ప్రకారం సబ్‌రిజిస్ట్రార్లను కూడా నేరస్తుల జాబితాలో చేర్చారని, సీనియర్ సబ్‌రిజిస్ట్రార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందని తెలిపారు. కొనేందుకు ఏ ప్రయివేటు సంస్థా ధైర్యం చేయలేకపోయిందన్నారు. ఇది కార్మికులు, ప్రజల పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. అయినా, స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే కుట్రలను మోడీ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. ముడిఖనిజం, బొగ్గు, రైల్వే ర్యాకులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకుండా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. 'ఉక్కు పరిశ్రమకు రా మెటీరియల్ తీసుకురండి, తయారైన ఉక్కును తీసుకువెళ్లండి' అని ప్లాంట్ యాజమాన్యం ఇఓఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్) ప్రకటన చేయడం అశేష త్యాగాలు కలిగిన ప్లాంట్‌ను అవమానించడమేనన్నారు. ఇఓఐ ప్రకటనతో స్టీల్‌ప్లాంట్‌కు వచ్చిన జిందాల్ స్టీల్ వర్క్స్ (జెఎస్‌డబ్ల్యు) ప్రతినిధులను స్టీల్ కార్మికులు తిప్పి పంపించారని గుర్తు చేశారు. అనకాపల్లి పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ జిల్లాలో కడప ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కర్నూలు కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా జరిగింది. ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్లో కార్మిక సంఘాల ఆధ్వర్యాన కార్మికులు నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల కార్యకర్తలు ఆర్‌టిసి డిపో ఎదుట భారీ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ దగ్గర కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని జిజిహెచ్ ఎదురుగా పూలే విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు బేబీరాణి పాల్గొని ప్రసంగించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నా జరిగింది. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, టి.మధు పాల్గొని సంఘీభావం తెలిపారు.

మోడీ అండతోనే అదానీ దోపిడీ

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు
- మందసలో వీరగున్నమ్మ వర్ధంతి సభ

అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దేశ సంపదను మోడీ అండతో అదానీ దోపిడీ చేస్తున్నారని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు అన్నారు. వీరగున్నమ్మ 83వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మందస బస్టాండ్ కూడలిలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షతన శనివారం సభ నిర్వహించారు. ఈ సభలో మధు మాట్లాడుతూ విశాఖ జిల్లాలోని గంగవరం పోర్టు, విమానాశ్రయాలు, విద్యుత్ కాంట్రాక్టులు, అడవులు ఇలా అన్నీ అదానీకి కట్టబెడుతున్నారని అన్నారు.

విశాఖ నుంచి ఒడిశా వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూములను అర్బన్ ల్యాండ్ సీలింగ్ పేరుతో పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ సబ్సిడీలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తోందని పేర్కొన్నారు. మోడీ ఎనిమిదేళ్ల పాలనలో రైతులు, కార్మికులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరంకుశంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపిని ఓడించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకుని సిఎం కుర్చీ కోసం చంద్రబాబు పాకులాడుతున్నారని విమర్శించారు. మోడీ అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 5న ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. మందస జమిందార్లకు వ్యతిరేకంగా వీరగున్నమ్మ పోరాటం సాగించారని తెలిపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజాకళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. అంతకుముందు వీరగున్నమ్మపురం కూడలి వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి మధుతోపాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు రచించిన వీరగున్నమ్మ కళింగ సివంగి పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు డి.గోవిందరావు, భవిరి కృష్ణమూర్తి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

- త్వరలో డిఎస్‌సి నోటిఫికేషన్
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఒంటిపూట బడులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. సమగ్ర శిక్షా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎండల తీవ్రత, విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. విద్యాశాఖ ఉత్తర్వులను అన్ని యాజమాన్య పాఠశాలలూ పాటించాలని ఆదేశించారు. ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు జరుగుతాయని చెప్పారు. 7, 9 తరగతులకు కూడా సమ్మెటివ్-2 పరీక్షలు ఉదయమే నిర్వహిస్తామని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

'పది' పరీక్షలకు పకడ్బంధీ ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పకడ్బంధీగా పూర్తిచేశామని మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఈ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 18 వరకు జరుగుతాయని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 8.45 గంటలకు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలని, 9.30 దాటితే అనుమతించబోమని వెల్లడించారు. 6,64,152 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,349 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఖాళీలు గుర్తిస్తున్నాం..

ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌పై కసరత్తు జరుగుతుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి బొత్స చెప్పారు. ఖాళీలను గుర్తించే ప్రక్రియ జరుగుతుందని, త్వరలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ అంశంపై కోర్టు స్టే ఇచ్చిందని, ఇది చాలా అన్యాయమని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కోర్టు స్టే ఇవ్వడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని, మీడియా కథనాలు రాయాలని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనరు ఎస్ సురేష్‌కుమార్, ఎస్ఎస్ఎ ఎస్‌పిడి బి శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి, ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టరు కెవి శ్రీనివాసులురెడ్డి, జాయింట్ డైరెక్టరు మువ్వా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాకు పాన్, ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ : సామాన్యులను ఇబ్బంది పెట్టే కేంద్ర ప్రభుత్వ చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రూ.1000 జరిమానాతో పాన్- ఆధార్‌తో అనుసంధానంపై ఆందోళనలు నెలకొనగా.. తాజాగా చిన్న మొత్తాల ఖాతాల వినియోగదారు లను ఇబ్బంది పెట్టే మరో నిర్ణయం తీసుకుంది. తపాళ శాఖలో తెరిచే చిన్న మొత్తాల పొదుపు ఖాతాలకు కూడా పాన్, ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నూతన నిబంధన ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ **డిమాండ్ నోటీసు**

రిజిస్టర్డు ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. రీజినల్ ఆఫీసు: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 2వ అంతస్తు, టి 19 టవర్స్, కర్బల్ మైదాన్, రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్-తెలంగాణ-500 003, www.hindujahousingfinance.com

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులైన మీరు హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుండి మీ స్థిరాస్తులను తాకట్టుపెట్టుట ద్వారా గృహరుణాలు/ఆస్తి పై రుణాలు పొందియున్నారు. తిరిగి చెల్లించుటలో మీరు డిఫాల్టిచెందారు; మీ రుణాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి. బకాయిలను రికవరీచేయుట కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు మీ గతంలో తెలిసిన చిరునామాలకు జారీచేశారు, కాని అవి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి. అందుకుగాను ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(2) ప్రకారం విషయాన్ని ఇందు ప్రచురిస్తున్నాము. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీస్, బకాయి మొత్తాలు, పంపిన డిమాండ్ నోటీసులు వివరాలు సెక్షన్ 13(2) క్రింద మరియు క్లెయించేయాల్సిన మొత్తాలు ఇందు దిగువ ఇవ్వబడినవి.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు/ఎల్ఎఎన్/లోన్ మొత్తం/బ్రాంచి పేరు	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసుస తేది & బకాయి మొత్తాలు
1	1. శ్రీ భరత్ కృష్ణ పుప్పల తండ్రి గోపాల్ కృష్ణ, ఫ్లాట్ నం.707, బ్లాక్-ఎ, అలేఖ్య పామ్ వుడ్స్, నానక్‌రాంగూడ, హైదరాబాద్-500008. మరియు శ్రీ భరత్ కృష్ణ పుప్పల, ప్లాట్ నం.714, సర్వే నం.476, గోరంట్ల గ్రామం, కొరిటిపాడు, గుంటూరు జిల్లా-522007. 2. శ్రీమతి సమీనా సొదాగర్, తండ్రి భరత్ కృష్ణ పుప్పల, ఫ్లాట్ నం.707, బ్లాక్-ఎ, అలేఖ్య పామ్ వుడ్స్, నానక్‌రాంగూడ, హైదరాబాద్-500008. మరియు శ్రీమతి సమీనా సొదాగర్, ప్లాట్ నం.714, సర్వే నం.476, గోరంట్ల గ్రామం, కొరిటిపాడు, గుంటూరు జిల్లా-522007. LAN No: AP/HDB/LBNG/A000000093	31-01-2023	24/03/2023 & Rs.25,53,010/- (రూపాయలు ఇరువై ఐదు లక్షల యాభై మూడు వేల పది మాత్రమే)
	ఏదైతే ఇంటెరెస్ట్ క్రియేట్‌చేయబడిన సెక్యూర్డ్ అసెట్ వివరణ: గుంటూరు జిల్లా, కొరిటిపాడు, గోరంట్ల గ్రామం వద్దగల సర్వే నం.476 గల 200చ.గ.ల విస్తీర్ణపు ఖాళీ ప్లాట్ నం.714 మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.719, దక్షిణం: ప్లాట్ నం.713, పడమర: 33అ.ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.715.		

పై రుణగ్రహీతలు, సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీచేయు తేదీ నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం పై పేర్కొన్న తేదీన సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీచేయు తేదీ నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.

తేది: 02.04.2023, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

అట్టుడికిన పుట్టపర్తి



- టిడిపి, వైసిపి శ్రేణుల బాహాబాహీ
- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అరెస్టు

సత్యమ్మ ఆలయం వద్ద కూర్చొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పల్లె రఘునాథరెడ్డిని బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్/ అమరావతి బ్యూరో

సత్యసాయి జిల్లా పుట్టపర్తి సత్యమ్మ దేవాలయం వద్ద శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. పుట్టపర్తి అభివృద్ధిపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వైసిపి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సవాల్, ప్రతిసవాళ్లతో పుట్టపర్తి ఒక్కసారిగా అట్టుడికింది. సత్యమ్మ దేవాలయం సాక్షిగా ఒకరిపై ఒకరు చెప్పులు, రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. వారం రోజుల క్రితం లోకేష్ పాదయాత్ర శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో కొనసాగింది. ఈ పాదయాత్రలో పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అవినీతిపై లోకేష్ పలు విమర్శలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గడిచిన నాలుగేళ్లలో పుట్టపర్తిలో తాను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు పట్టణంలోని సత్యమ్మ గుడి దగ్గరకు రావాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, పుట్టపర్తి అభివృద్ధిపై చర్చకు సిద్ధం అంటూ మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పల్లె రఘునాథరెడ్డి ప్రతిసవాల్ విసిరారు. శనివారం పట్టణంలోని సత్యమ్మ గుడి వద్దకు రావాలని ఎమ్మెల్యేకు తెలిపారు. పోలీసులు అప్రమత్తమై శుక్రవారం రాత్రి నుంచి పుట్టపర్తిలో 30 యాక్టును అమల్లోకి తెచ్చారు. శనివారం ఉదయం పుట్టపర్తి టిడిపి కార్యాలయం వద్ద పల్లె రఘునాథరెడ్డితో పాటు, ఇతర టిడిపి ముఖ్య నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అనుచరులు వాహనాల్లో టిడిపి కార్యాలయం నుంచి సత్యమ్మ గుడి వద్దకు వెళ్లారు. దీంతో, పల్లె రఘునాథరెడ్డి టిడిపి కార్యాలయం వెనుక వైపు గోడ దూకి కారులో సత్యమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు చెప్పులు, రాళ్లు, టెంకాయలతో రఘునాథరెడ్డి వాహనంపై విసిరారు. రఘునాథరెడ్డి వాహనంతో పాటు, మరో రెండు వాహనాల అద్దాలు పగిలిపోయాయి. 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ఎవరూ బయట ఉండకూడదంటూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పల్లె రఘునాథరెడ్డికి పోలీసులు తెలియజేశారు. నాయకులు అక్కడి నుంచి వెళ్లకపోవడంతో ఇరు గ్రూపులపై లాఠీఛార్జీ చేశారు. అంతకుముందే రఘునాథరెడ్డితో పాటు టిడిపి నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వదిలేశారు. పోలీసులు వైసిపి నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ టిడిపి నాయకులు పోలీస్ స్టేషన్, సత్యమ్మ గుడి వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పుట్టపర్తి సంక్షేమాన్ని గాలి కొదిలి అక్రమ మార్గంలో ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. పుట్టపర్తి ప్రాంతంలోని బిల్డర్లతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి డబ్బులు గుంజాడని ఆయన విలేకరుల సమావేశంలో ఆరోపించారు.

దాడి దుర్మార్గం : అచ్చెన్న

పుట్టపర్తిలో టిడిపి కార్యకర్తలపై దాడి దుర్మార్గపు చర్య అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండతోనే రాష్ట్రంలో వైసిపి రౌడీ మూకలు పెట్రేగిపోతున్నాయని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పుట్టపర్తిని అక్రమాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. దాడిచేసిన వైసిపి గూండాల్ని వదిలేసి టిడిపి కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్చి చేయడం ఏమిటని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య టిడిపి కార్యాలయంలో విలేకరులతో అన్నారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ **డిమాండ్ నోటీసు**

రిజిస్టర్డు ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. రీజినల్ ఆఫీసు: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 54-20-10/1ఎ, ప్లాట్ నం.43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ-520 008, www.hindujahousingfinance.com

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులైన మీరు హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుండి మీ స్థిరాస్తులను తాకట్టుపెట్టుట ద్వారా గృహరుణాలు/ఆస్తి పై రుణాలు పొందియున్నారు. తిరిగి చెల్లించుటలో మీరు డిఫాల్టిచెందారు; మీ రుణాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి. బకాయిలను రికవరీచేయుట కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు మీ గతంలో తెలిసిన చిరునామాలకు జారీచేశారు, కాని అవి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి. అందుకుగాను ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(2) ప్రకారం విషయాన్ని ఇందు ప్రచురిస్తున్నాము. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీస్, బకాయి మొత్తాలు, పంపిన డిమాండ్ నోటీసులు వివరాలు సెక్షన్ 13(2) క్రింద మరియు క్లెయించేయాల్సిన మొత్తాలు ఇందు దిగువ ఇవ్వబడినవి.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు/ఎల్ఎఎన్/లోన్ మొత్తం/బ్రాంచి పేరు	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసుస తేది & బకాయి మొత్తాలు
1	1. 1. శ్రీమతి లక్ష్మి నాగ సుజాతా కుందేటి, భర్త బాల సుబ్రమణ్యేశ్వర రావు, 2. శ్రీ బాలాసుబ్రమణ్యేశ్వర రావు కుందేటి, తండ్రి నాంచారయ్య. Lan No. AP/VWD/BENZ/A000000219 & AP/VWD/VJDA/A000000191 రూ.45,00,000/- + రూ.9,71,645/- = రూ.54,71,645/- (రూపాయలు యాభై నాలుగు లక్షల డెబ్బై ఒక వేల ఆరు వందల నలభై ఐదు మాత్రమే) ఇరువురి నివాసం: డోర్ నం.56-15-16, సీతారామ నగర్, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, కృష్ణ జిల్లా, ఎపి-520010.	31-01-2023	16.03.2023, 09.03.2023 నాటికి వడ్డీతోపాటు **రూ.58,58,106/-** (రూపాయలు యాభై ఎనిమిది లక్షల యాభై ఎనిమిది వేల నూటా ఆరు మాత్రమే)
	ఏదైతే ఇంటెరెస్ట్ క్రియేట్‌చేయబడిన సెక్యూర్డ్ అసెట్ వివరణ: కృష్ణా జిల్లా, ఎస్ఆర్ఓ పటమట పరిధిలో పెనమలూరు మండలం, కానూరు గ్రామం& గ్రామపంచాయతిలో గల పాత డోర్ నం.5-125/1, ప్లాట్ నం.లు 6&7తో సబ్‌స్క్వెంట్ ఆర్.ఎస్.నం.152/1ఎ, ఎల్.పి.నం.51/82 లో అన్ని ఇతర ఉమ్మడి వసతులతోపాటు 80.0చ.అ.ల కార్ పార్కింగ్ మరియు 397.0చ.అ.ల ఉమ్మడి ఏరియా, 1588.0చ.అ.ల ప్లింత్ ఏరియాతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏదైతే అసంపూర్తి ఫ్లాట్ నం.110లో "యార్లగడ్డ కన్‌స్ట్రక్షన్స్" పేరు& స్టైల్‌తో ఏదైతే నిర్మించిన అపార్టుమెంట్ లో 735.78చ.గ.లు లేదా 615.20చ.మీ.ల పూర్తి విస్తీర్ణంలో నిర్మించిన 73.57చ.గ.లు లేదా 61.51చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని భాగం మరియు సరిహద్దులు: **"ఎ" షెడ్యూలు** (పూర్తి ల్యాండ్ సరిహద్దులు-735.78చ.గ.లు), తూర్పు: 40.0అ.ల వెడల్పు రోడ్డు-86.0"అ.లు, దక్షిణం: 33.0"అ.ల వెడల్పు రోడ్డు-77.0"అ.లు, పడమర: కంచర్ల గురుప్రసాద్‌కు చెందిన ల్యాండ్-86.0"అ.లు, ఉత్తరం: పొట్లూరు రాఘవేంద్ర రావుకు చెందిన ల్యాండ్-77.0"అ.లు. **"బి" షెడ్యూలు** ఫ్లాట్ కు సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: లిఫ్టు& కారిడార్.		

పై రుణగ్రహీతలు, సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీచేయు తేదీ నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం పై పేర్కొన్న తేదీన సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీచేయు తేదీ నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.

తేది: 02.04.2023, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

తెనాలిలో టిడిపి ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో శనివారం టిడిపి చేపట్టిన బంద్, ర్యాలీపై పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. దీంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఆంక్షలు విధించారు. దీనిని నిరసిస్తూ టిడిపి శ్రేణులు రోడ్డుపై ఆందోళనకు దిగాయి. పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మరోవైపు టిడిపి కుల రాజకీయలు చేస్తోందని ఆరోపిస్తూ వైసిపి నేతలు కూడా నిరసనకు దిగారు. శుక్రవారం జరిగిన తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో టిడిపి కౌన్సిలర్‌పై వైసిపి కౌన్సిలర్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆర్యవైశ్య సంఘాలు శనివారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌లో భాగంగా వార్డు కౌన్సిలర్ దేశు యుగంధర్ నేతృత్వంలో టిడిపి శ్రేణులు, ఆర్యవైశ్య సంఘాల ప్రముఖులు నిర్వహించిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఆగ్రహించిన టిడిపి నేతలు రోడ్డుపైనే బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో టిడిపి నాయకులు పసుపులేటి త్రిమూర్తి, మహ్మద్ ఖద్దూస్, పలువురు నేతలను బలవంతంగా లాక్కెళ్లి వాహనాల్లో తెనాలి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు.

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో టిడిపి నేతల అరెస్టులను నిరసిస్తూ టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డూండీ రాకేష్ నిరసనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్య సామాజిక తరగతిపై జరుగుతున్న దాడులకు నిరసనగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కొల్లిపర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిడిపి ర్యాలీ విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పోలీసులు కల్పించుకుని వారిని అక్కడ నుంచి పంపించేశారు. అరెస్టు చేసిన టిటిడి నేతలను వ్యక్తిగత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

'దసరా'లో ఆ దృశ్యాలు తొలగించాలి

- అంగన్‌వాడీల యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దసరా సినిమాలో అంగన్‌వాడీ వర్కర్లను దొంగలుగా చిత్రీకరించే దృశ్యాలను తక్షణం తొలగించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దసరా సినిమాలో సాయంత్రం పూట అంగన్‌వాడీ కేంద్రం తాళం తెరిచి కొంగులో కోడిగుడ్లను దొంగతనంగా తీసుకెళ్తున్నట్లు దృశ్యాలను పెట్టడం సరైంది కాదన్నారు. గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ సేవలందించే అంగన్‌వాడీలను ఇలా అవమానిస్తూ చిత్రీకరించడం తగదన్నారు. కనీస వేతనాలు ఇవ్వకున్నా, టిఎ, డిఎలు సకాలంలో ఇవ్వకున్నా ఏ మాత్రం సేవలకు అంతరాయం వుండకూడదని తపించి పనిచేసే అంగన్‌వాడీలను దొంగలుగా చిత్రీకరించడం సరికాదన్నారు.

కష్టాలతో కొత్త ఏడాది

- ఆర్థికశాఖ చుట్టూ సమస్యలే
- కేంద్రమిచ్చే సాయంపైనే ఆశలన్నీ
- కొత్త అనధికార పన్నులపైనా ఆలోచన



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త ఆర్థిక సంవత్సరం కూడా కష్టాల్లోనే ప్రారంభమైంది. 2022-23 సంవత్సరం అంతా సమస్యల్లోనే కొనసాగగా, 2023-24 ఆర్థిక సంవత్సరం కూడా అదే తరహాలో ప్రారంభమైనట్లు ఆర్థికశాఖ అధికారులే చెబుతున్నారు. గతేడాది మొత్తం ఆదాయం కన్నా వ్యయం గణనీయంగా పెరిగిపోవడంతో ప్రతిరోజూ రుణాలు, వేస్ అండ్ మీన్స్, ఓవర్‌డ్రాఫ్టలతోనే కాలం నెట్టుకురావాల్సి వచ్చింది. ఈ ఏడాది తొలి నాలుగు రోజుల్లోనే రూ.3 వేల కోట్ల రుణంగా ప్రారంభమవుతుండడం గమనార్హం. కొత్త ఆర్థిక సంవత్సరం కూడా అదే బాటలో పయనిస్తోంది. ఇప్పటికే భారీగా వ్యయం కళ్లముందుండగా, ముగిసిన ఏడాదికి సంబంధించిన బిల్లులు, ఇతర బకాయిలు కొత్త సంవత్సరంలోకి బదలాయించారు. ఇవి కూడా భారంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. వార్షిక బడ్జెట్‌ను రూ.2,79,279 కోట్లతో ఆమోదించినప్పటికీ, దానిని చివరకు రూ.2.93 కోట్లకు సవరించారు. అందులో కూడా పాత బకాయిలకు సంబంధించి నిధులు కేటాయించ లేదు. అంటే ఈ భారాన్ని పలు శాఖలకు సంబంధించిన కేటాయింపుల నుంచే చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆయా శాఖల వ్యవహారాలపై వ్యతిరేక ప్రభావం చూపించనుంది. ముగిసిన ఏడాది పొడవునా ఉద్యోగుల జీతాలు, పింఛన్లపై ఆందోళనలు కొనసాగాయి. ఏ ఒక్క నెల్లోనూ ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇక శనివారం నుంచి ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరంలోనే ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉండడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆగ్రహాన్ని తగ్గించాలంటే టంఛనుగా జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. అందుకు తగిన నిధులను కూడా ముందుగానే సమకూర్చుకోవాల్సి ఉంది. వీటికి తోడు సామాజిక పింఛన్లు, నవరత్నాల్లో భాగంగా అందించాల్సిన నగదు బదిలీకి కూడా ఒకేసారి నిధులు సమకూర్చుకోవడం కొంత కష్టమేనని వారంటున్నారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.2,56,256 కోట్లతో బడ్జెట్‌ను ఆమోదించి నప్పటికీ చివరకు 2.40 లక్షల కోట్లు మాత్రమే వ్యయం అయినట్లు సవరణ బడ్జెట్‌లో చూపించారు. రూ.16 వేల కోట్లు లోటుగా ఉన్నట్లు తేలింది. ఈ మేరకు జరగాల్సిన పనులు, చెల్లింపుల భారం కూడా కొత్త ఆర్థిక సంవత్సరంపైనే ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇందుకు తగ్గ రాబడి లేకపోవడంతో 2022-23లో ప్రతి నెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓవర్‌డ్రాఫ్ట్ కూడా భారంగానే మారుతూ, రిజర్వ్‌బ్యాంకు నుంచి హెచ్చరిక లేఖలు కూడా వచ్చాయి. ఇదే పరిస్థితి 2023-24లో కూడా తప్పదని ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

కేంద్రంపైనే ఆశలన్నీ..

కేంద్రం నిధులు కూడా ఆశించిన స్థాయిలో రాకపోవడం రాష్ట్రానికి శరాఘాతంగా పరిణమించింది. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు 4 శాతం వరకు రావాల్సి ఉన్నప్పటికీ, అందులో కూడా కొంత కోతలు పడినట్లు తెలిసింది. పోలవరం, వెనుకబడిన జిల్లాలకు నిధులు, రాజధాని నిర్మాణం, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధుల కోతలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్త ఏడాదైనా కేంద్రం సరైన నిధులు ఇవ్వగలిగితే ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కవచ్చుని, లేదంటే మళ్లీ రుణాలపై ఆధారపడక తప్పదని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. ఇదే సమయంలో ఆదాయాన్ని పెంచుకునేందుకు గానూ ప్రస్తుతం ఉన్న పన్నుల్లో మార్పులు చేసే అవకాశాలు ఉంటాయని తెలుస్తోంది. వీటితోపాటు సెస్‌ల పెంపు, మద్యంపై వచ్చే ఆదాయాన్ని పెంచుకునే ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలిసింది. మొండి బకాయిల వసూళ్లపైనా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ఆంధ్రా Andhra కార్పొరేషన్ Corporation

బెంజ్ సర్కిల్ శాఖ, సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలని, విజయవాడ-520010. ఫోన్: 0866-2496647.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీస్) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (యాక్ట్ 54 ఆఫ్ 2002 ప్రకారం) వారి నుండి దిగువ వారికి

ఋణగ్రహీతలు మరియు స్థిరాస్తి వివరములు

1) ఋణగ్రహీత & హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ మాజేటి శివ సుబ్రహ్మణ్యం (ఋణగ్రహీత), తండ్రి: శేషు నారాయణ, 2) శ్రీమతి మాజేటి నాగలక్ష్మీ (సహ-ఋణగ్రహీత), భర్త: యం.శివ సుబ్రహ్మణ్యం, 31-7-13బి, గోగినేని వారి వీధి, మారుతి నగర్, మాచవరం, ఏలూరు రోడ్డు, విజయవాడ-520004. & ఫ్లాట్ నెం.401, 3వ అంతస్తు, అయ్యప్ప నగర్, చిన్నఅవుటపల్లి, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. 3) శ్రీ మాజేటి శివ సుబ్రహ్మణ్యం గారికి చెందిన చట్టరీత్యా వారసులకు కూడ వర్తించును.
ఆస్తి వివరములు: షెడ్యూల్-ఏ: కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు రిజిస్ట్రేషన్ జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, చిన్నఅవుటపల్లి గ్రామ పంచాయతి ఏరియాలో చేరిన, చినఅవుటపల్లి గ్రామ రీ సర్వే నెం.137/1 రులో ప్లాట్ నెం.45 ఏ. రు దాఖలా ఎకరం 0.18 సెంట్ల 500 చలింలు లేక 895.4 చ॥గ॥లు లేక 748.643 చ॥మీ॥ల స్థిరాస్తి నివేశన స్థలమునకు హద్దులు: **తూర్పు:** మాచినేని కోటేశ్వరరావు గారి భూమి, **దక్షిణం:** మాచినేని కోటేశ్వరరావు గారి భూమి, **పడమర:** మధుకాన్ ప్రాజెక్ట్ వారి భూమి, **ఉత్తరం:** రోడ్డు (40 అడుగుల వెడల్పు గల రోడ్డు). యీ నాలుగు హద్దుల మధ్య 895.4 చ॥గ॥లు లేక 748.643 చ॥మీ॥ల స్థిరాస్తి నివేశన స్థలములో జాయింటు అనిర్దిష్ట (అన్‌డివైడెడ్ షేరు) హక్కు 44 చ॥గ॥లు లేక 36.788 చ॥మీ॥లు స్థిరాస్తి నివేశన స్థలము. షెడ్యూల్-బి: సదరు 1వ ఐటం దాఖలా 895.4 చ॥గ॥ల స్థిరాస్తి స్థలములో నాచే నిర్మించబడుచున్న అయ్యప్ప టవర్స్ అను పేరు గల అపార్ట్‌మెంట్ నందలి మీకు విక్రయించిన థర్డ్ ఫ్లోరులో అసంపూర్తిగా నిర్మించబడిన 2 బెడ్ రూమ్ ఫ్లాట్ నెం.1 రు దాఖలా అపార్ట్‌మెంటు కట్టడములకు హద్దులు: **తూర్పు:** ఓపెన్ టూ స్కై, **దక్షిణం:** థర్డ్ ఫ్లోర్ ఫ్లాట్ నెం.2 మరియు కారిడార్, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** ఓపెన్ టూ స్కై. యీ నాలుగు హద్దుల మధ్య 936 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 200 చ॥అ॥ల కామన్ ఏరియా మరియు 125 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా అన్ని సులభ హక్కులతో కలదు.
రిజర్వు ధర : రూ. 15,00,000/- (అక్షరాల పదిహేను లక్షల రూపాయలు మాత్రమే)
డిమాండ్ నోటిసు తేది: 01-06-2022, **స్వాధీనత నోటిసు తేది: 04-03-2023.**

2) ఋణగ్రహీత & హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ యలమల్లి వెంకట ధన రాజు, తండ్రి: శ్రీరామ మూర్తి, 2) శ్రీమతి యలమల్లి ఝాన్సీ, భర్త: వెంకట ధన రాజు, టి.ఎఫ్-4, 40-15/1-29, బృందావన్ కాలనీ, విజయవాడ-8. 3) శ్రీ యలమల్లి వెంకట ధన రాజు, తండ్రి: శ్రీరామ మూర్తి, 4) శ్రీమతి యలమల్లి ఝాన్సీ, భర్త: వెంకట ధన రాజు, ఫ్లాట్ నెం.401, 3వ అంతస్తు, శ్రీ చక్ర రెసిడెన్సీ, నవోదయ కాలనీ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా -522501.
ఆస్తి వివరములు: షెడ్యూల్-ఏ: గుంటూరు జిల్లా-522501, తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామం, ఆర్.యస్.నెం.110 & 111, రూఫ్.నెం.12/84లో 44 చ॥గ॥లకు సమానం గల స్థలం ఈ దిగువ హద్దులలో **తూర్పు:** 40 అడుగుల రోడ్డు, **దక్షిణం:** సర్వే.నెం.110 పి.రాగమల్లిక & ఇతరుల భూమి, **పడమర:** సర్వే.నెం.110 గుడి భూమి, **ఉత్తరం:** సర్వే.నెం.110 డి.శివ రామిరెడ్డి భూమి, ఈ సరిహద్దుల మధ్య 8700 (ఎకరం 1.78) చ॥గ॥లలో 44 చదరపు గజాల అవిభాజ్య మరియు అనిశ్చితపు వాటా. షెడ్యూల్-బి: పై షెడ్యూల్-ఏ లో "శ్రీ చక్ర రెసిడెన్సీ" పేరుతో నిర్మించబడిన అపార్ట్‌మెంట్ బ్లాక్-డి, 3వ అంతస్తులో సగం పూర్తియిన (2 బి.హెచ్.కె) ఫ్లాట్ నెం.401 యలమల్లి వెంకట ధన రాజు, తండ్రి: శ్రీరామ మూర్తి గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** డక్ట్ & ఫ్లాట్ నెం.402. పై సరిహద్దుల మధ్య గల ఆర్.సి.సి అపార్ట్‌మెంట్‌లో 928 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు 197 చ॥అ॥ల కామన్ ఏరియా (మొత్తం 1125 చ॥అ॥లు) మరియు క్రింది అంతస్తులో దాదాపు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా. **రిజర్వు ధర : రూ. 32,22,000/- (అక్షరాల ముప్పై రెండు లక్షల ఇరవై రెండు వేల రూపాయలు మాత్రమే)**
డిమాండ్ నోటిసు తేది: 17-10-2022, **స్వాధీనత నోటిసు తేది: 04-03-2023.**

3) ఋణగ్రహీత & హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ మధిర శ్రీ రామ్, తండ్రి: విశ్వనాథం, ఆర్.నెం.204, శాంతి రెసిడెన్సీ, మైత్రీ నగర్, అంగుల్, ఒరిస్సా. 2) శ్రీ మధిర శ్రీ రామ్, తండ్రి: విశ్వనాథం, 3) శ్రీ మధిర విశ్వనాథం, తండ్రి: దీక్షితులు, 4) శ్రీ మధిర రాజేశ్వరి, భర్త: విశ్వనాథం, 29-2-29, రామమందిరం వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2. 5) శ్రీ మధిర విశ్వనాథం, తండ్రి: దీక్షితులు, 6) శ్రీ మధిర రాజేశ్వరి, భర్త: విశ్వనాథం, డి.నెం.10-11-5, జి.నగర్, లైబ్రరీ రోడ్, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా.
ఆస్తి వివరములు: షెడ్యూల్-ఏ: కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్-రిజిస్ట్రార్, విజయవాడ టౌన్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గవర్నర్‌పేట్, రామమందిరం రోడ్, మునిసిపల్ వార్డు నెం.24, రెవెన్యూ వార్డ్ నెం. 9, బ్లాక్ నెం.14, యన్.టి.యస్.నెం.701, ఫ్లాట్ నెం.7, పాత డి.నెం.21/286, ప్రస్తుత డి.నెం.29-2-28/1, 29-2-29/1, 29-2-28, 29-2-29/2, మరియు 29-2-28/3లో మొత్తం 647 చ.గ.లు ఈ దిగువ హద్దులలో **తూర్పు:** జంధ్యాల భగవత్ శాస్త్రి గారి ఆస్తి, **దక్షిణం:** ఆత్మకూరి గోపాలరావు గారి ఆస్తి, **పడమర:** రామమందిరం వీధి, **ఉత్తరం:** చెరుకుపల్లి ఉమాదేవి గారి ఆస్తి. ఈ నాలుగు సరిహద్దుల మధ్య 647 చ.గ.లు లేదా 540.976 చ.మీ.లలో ఉమ్మడి అవిభాజ్యపు మరియు అనిశ్చితపు వాటా 32.35 చ.గ.లు లేదా 27.04 చ.మీ.ల స్థలం. షెడ్యూల్-బి: పైన పేర్కొన్న షెడ్యూల్ ఏ ఆస్తి యొక్క మొత్తం విస్తీర్ణంలో "శ్రీ సాయి ధవనేష్ టవర్స్" పేరు మరియు శైలిలో నిర్మించబడిన అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులో 909 చ.అ.ల ప్లింత్ ఏరియా, 20 చ.అ.ల కామన్ ఏరియా మరియు 20 చ.అ.ల పార్కింగ్ ఏరియాతో శ్రీ మధిర శ్రీరామ్, తండ్రి: విశ్వనాథం గారికి చెందిన ఫ్లాట్ నెం.3ఎఫ్-3 ఈ దిగువ హద్దులలో: **తూర్పు:** ఓపెన్ టూ స్కై, **దక్షిణం:** ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం. 3ఎఫ్-4 మధ్య ఉమ్మడి గోడ, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టూ స్కై.
రిజర్వు ధర : రూ. 46,85,000/- (అక్షరాల నలభై ఆరు లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే)
డిమాండ్ నోటిసు తేది: 17-10-2022, **స్వాధీనత నోటిసు తేది: 24-02-2023.**

4) ఋణగ్రహీత & హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) షేక్ షబ్బీర్ అలీ, తండ్రి: షేక్ అబ్దుల్ సత్తార్, 2) శ్రీమతి షేక్ ఆయేషా, భర్త: షేక్ షబ్బీర్ అలీ, డి.నెం.8-75, ఆర్.టి.సి కాలని, శ్రీ చైతన్య స్కూల్ దగ్గర, కొత్తపేట, వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా-523157. 3) షేక్ షబ్బీర్ అలీ, తండ్రి: షేక్ అబ్దుల్ సత్తార్, 4) శ్రీమతి షేక్ ఆయేషా, భర్త: షేక్ షబ్బీర్ అలీ, ప్లాట్ నెం.23, 4వ లైన్, డి.నెం.4-147, లక్ష్మీ వినిత్ ఎన్‌క్లేవ్, ఈడుపుగల్లు గ్రామం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా-521151.
ఆస్తి వివరములు: కృష్ణాజిల్లా-521151, కంకిపాడు మండలం, ఈడుపుగల్లు గ్రామం, ఆర్.యస్.నెం. 421/4, ప్లాట్ నెం.23, 4వ లైన్, లక్ష్మీ వినిత ఎన్‌క్లేవ్, 91.52 చ॥గ॥లు లేదా 76.52 చ॥మీ॥ల భూమి మరియు నివాస భవనం క్రింది అంతస్తు, ప్లింత్ ఏరియా 395.12 చ॥అ॥లలో గల శ్రీ షేక్ షబ్బీర్ అలీ & శ్రీమతి షేక్ ఆయేషా గారికి చెందిన ఆస్థి ఈ దిగువ హద్దులలో **తూర్పు:** కాంపౌండ్ గోడ, **దక్షిణం:** కాంపౌండ్ గోడ, **పడమర:** 40 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం.22.
రిజర్వు ధర : రూ. 16,00,000/- (అక్షరాల పదహారు లక్షల రూపాయలు మాత్రమే)
డిమాండ్ నోటిసు తేది: 07-09-2022, **స్వాధీనత నోటిసు తేది: 09-12-2022.**

విషయం: SARFAESI Act (Act 54 of 2002) క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** కు తనఖా పెట్టిన మీకు చెందిన పైన వివరించిన ఆస్థి బకాయి మొత్తము రాబట్టుటకు అమ్మకం జరుగుతుంది.
పై బ్యాంకు వారి ద్వారా 13(2) విభాగం క్రింద **డిమాండ్ నోటీసు** పంపినప్పటికీ మీరు బ్యాంకుకి చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో విఫలమైనారు.
పై చట్ట పరిధిలో సంక్రమించిన అధికారాలతో, పై ఆస్థిని స్వాధీనపరచుకోవడమైనది. ఆస్థిని స్వాధీనం చేసుకొన్నప్పటికీ, **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజ్‌సర్కిల్ శాఖ** కు మీరు బకాయి పడిన మొత్తమును చెల్లించలేదు.
అందువలన ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 30 దినముల తర్వాత పై ఆస్తులను బహిరంగ ఇ-వేలం ద్వారా **రిజర్వు ధర** కు గాని అంతకంటే ఎక్కువకు గాని విక్రయించబడును.
వేలం తేది, సమయం మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరములు అమ్మకం ప్రకటన ద్వారా విడిగా జారీచేయబడును మరియు అత్యధిక ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తిని విక్రయించబడును. ప్రైవేట్ అమ్మకం లేదా కొటేషన్ పొందడం ద్వారా ఎవరైనా వ్యక్తులకు ఆస్తిని విక్రయించే ప్రతిపాదన మీకు ఏదైనా ఉన్నచో, ఆ విషయమును లెటర్ / ప్రకటన స్వీకరించిన తేది నుండి 07 దినములలోగా మాకు తెలియపరచవలెను. మీరు అట్లు తెలియపరచినచో మీకు అటువంటి ప్రతిపాదన ఏది లేదని భావించి, పైన సూచించిన విధంగా ఇ-వేలం ద్వారా సదరు ఆస్థిని విక్రయించుటకు సిద్ధపడి తదుపరి చర్యలు తీసుకోబడును. ఇంకనూ మీరు చెల్లించవలసిన బకాయి మొత్తంతో పాటు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతరత్రా వ్యయములు **పైన తెలిపిన డిమాండు నోటీసు** తేదిలలో సూచించబడినవి. అమ్మకం కొరకు నిర్ధారించిన తేదీ లోగా చెల్లించనిచో, ఇందు షెడ్యూలులో తెలిపిన ఆస్థిపై అమ్మకమునకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోబడవని ఇందుమూలముగా మీకు సూచించడమైనది. (సెక్షన్ 13 (8) చట్టం ప్రకారం విడిపించుకునే హక్కు కలదు)

తేది : 31-03-2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

వైకోమ్ స్ఫూర్తి

దేశంలోనే ఒక అతి పెద్ద సంఘటిత పోరాటానికి శత సంవత్సరం. సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాల స్వాగతోత్సవం. దేశ స్వాతంత్ర్య పోరాట ఉద్యమాన్ని పునరుజ్జీవనోద్యమాలతో అనుసంధానించే ఒక ముఖ్యమైన ఘట్టానికి తొలి మెట్టు వైకోమ్ సత్యాగ్రహ పోరాటం. ఈ పోరాటమే అస్పృశ్యతకు వ్యతిరేకంగా కేరళ సహా దేశంలోని అనేక చోట్ల జరిగిన పోరాటాలకు, రాజకీయ ఉద్యమాలకు ప్రేరణ. నాటి సత్యాగ్రహ స్ఫూర్తి... ఆంగ్లేయులపైనే కాదు, ఆధిపత్యపు అరాచకం మీద కూడా నడిచింది. అంటరానితనం నిర్మూలన కోసం, అట్టడుగు వర్గాలకు గుడి దారులు తెరిపించిన అరుదైన ఉద్యమం ఇది. 'వైకోమ్ సత్యాగ్రహుల పోరాటం, స్వరాజ్య పోరాటానికి ఏమాత్రం తక్కువ కాదు' అని 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీజీ అంటాడు. అన్ని కులాలకూ దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలని, వైకోమ్ లోని ఆలయ వీధుల్లో నిషేధాన్ని తొలగించాలని 1924 మార్చి 30 నుంచి, 1925 నవంబర్ 23 వరకు 603 రోజుల పాటు ఈ నిరసన జరిగింది. అస్పృశ్యతకు వ్యతిరేకంగా సాగిన ఈ ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక భాగమే. ఆచారాలను, కులతత్వాన్ని తిరస్కరించాలన్న పిలుపు ఈ పోరాటంలో ప్రతిధ్వనించింది.

'తరతరాల బూజుభావాలకి పాతర్లలాంటి యీ ధర్మశాస్త్రాల్ని/ కులం పట్ల పవిత్ర భావాల్ని నూరిపోస్తోన్న యీ ధర్మశాస్త్రాల్ని/ ధర్మశాస్త్రాలకి దాస్యం చేయమని బోధిస్తోన్న యీ మతాన్ని/ పునాదుల్తో పాటు మూలమట్టంగా నాశనం చేయండి' అంటారు 'సత్యకామ జాబాలి'లో సివి. అణగారిన వర్గాల దేవాలయాల ప్రవేశం కోసం మొదటిసారిగా జరిగిన సంఘటిత ఉద్యమం. నారాయణగురు శిష్యుల్లో ఒకరైన జాతీయ కాంగ్రెస్ నేత టికె మాధవన్ అన్ని కులాలకూ దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలంటూ 1918లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తిని ఎవరూ పట్టించుకోకపోవడంతో... కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. గాంధీజీ సైతం తన మద్దతు ప్రకటించారు. అలా మొదలైన వైకోమ్ ఉద్యమంలో అనేక నిమ్నకులాలతో పాటు అగ్రవర్ణంగా పేరొందిన నాయర్లు సైతం పాల్గొన్నారు. ముగ్గురు చొప్పున దేవాలయం వీధుల్లోకి శాంతియుతంగా వెళ్లడం, వారిని అరెస్టు చేయగానే, మరో ముగ్గురు బయల్దేరడం. ఇదే తంతు రోజులపాటు కొనసాగింది. క్రమంగా జైళ్లన్నీ నిండిపోయాయి. భారీ వర్షాలకు సైతం వెనక్కు తగ్గలేదు. నారాయణ గురు తన వేలూరు మఠాన్ని సత్యాగ్రహులకు కార్యాలయంగా మార్చారు. 1925 మార్చిలో జైలు నుంచి విడుదలైన గాంధీజీ వైకోమ్ రావడంతో సత్యాగ్రహులకు బరింత బలం చేకూరింది. పునరుజ్జీవనోద్యమ ఆలోచనలు ప్రతివారినీ ప్రభావితం చేసే గొప్ప ప్రవాహంగా ఎదిగాయి. ఉద్యమం తీవ్ర రూపం తీసుకోవడంతో ట్రావెన్‌కోర్ మహారాణి దిగి వచ్చింది. నాలుగింట మూడు ఆలయ దారుల్లో అన్ని కులాల వారికీ అనుమతిచ్చింది. దీనికి గుర్తుగా సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాలు ఏప్రిల్ 1 నుంచి కేరళలో ప్రారంభమయ్యాయి.

కుల ఆధారిత సమాజం సృష్టించిన నిషేధాలు, ఆచారాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో కులతత్వం లేని ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రధానమైనది. వైకోమ్ సత్యాగ్రహ ఆందోళనల్లో భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు... అదే స్థాయిలో చైతన్యాన్ని, స్ఫూర్తిని పొందారు. ఇప్పుడు సత్యాగ్రహ శత జయంతి జరుపుకుంటున్న సమయంలో ఈ చైతన్యం మరింత స్ఫూర్తిని రగిలించేదిగా వుండాలి. సత్యాగ్రహం వైకోమ్ ఆలయ ప్రాంగణంలో జరిగినప్పటికీ అన్ని కులాలు, మతాల వారు పాల్గొన్న ఉద్యమం. కుల ఆధారిత నిషేధాలు, వివక్ష, స్వేచ్ఛ నిరాకరణలకు వ్యతిరేక పోరాటానికి నాంది. మతోన్మాదం పెచ్చుమీరి, సంఘ్‌పరివార్ శక్తులు దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులకు తెగబడుతోన్న వైనం నాటి పరిస్థితికే మాత్రం తీసిపోదు. నేడు ఈ పరిస్థితిని ఎదుర్కోవడమంటే... నాటి వైకోమ్ సత్యాగ్రహ ఉద్యమానికి నిజమైన వారసత్వాన్ని కొనసాగించడమే. 'నా పుట్టుక అసహ్యమైనప్పుడు/ పరమ అసహ్యమైన పుట్టుక నుండి/ కళ్ళు తెరిచిన దేవుళ్ళను కొలుస్తున్న/ మీ పుట్టుకనే నేను ఇప్పుడు సవాల్ చేస్తున్నాను' అంటాడో కవి. ఇది నిరంకుశత్వంపై పోరాటం. తనకు జరిగిన అవమానాల వేదన నుంచి రగిలిన చైతన్య స్ఫూర్తితో స్వేచ్ఛా, సమానత్వం కోసం సాగించే సమరం. ఇది మన వారసత్వం.

మహనీయుల మాట

పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సాధారణ క్రమంలో కార్మిక వర్గపు వాస్తవ స్థితి ఏమిటో చెప్పింది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం మాత్రమే.

- వి.ఐ. లెనిన్

బిజెపికి గడ్డుగానే కర్ణాటక సమరం

ప్రస్తుతం

తెలకపల్లి రవి

మోడీ ప్రభుత్వ నిరంకుశ పోకడలపై దేశ వ్యాపితంగా అనేక రూపాలలో ప్రతిపక్షాల ఉమ్మడి పోరాటం ఉధృతమవుతున్న సమయంలో కర్ణాటక శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మే 10న ఒకే విడతగా ఎన్నికలు పూర్తవుతాయన్న ప్రకటనే ఒక విధంగా ఆశ్చర్యం కలిగించింది. మోడీ మూలపీఠమైన గుజరాత్ వంటి చిన్న రాష్ట్రంలోనే ఏడు దఫాలుగా ఎన్నికలు జరిగిన నేపథ్యంలో కొంత వింతగానే అనిపిస్తుంది. అదలా వుంచితే అదానీ బాగోతంతో మోడీ ఇరకాటంలో చిక్కుకోవడం, రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు దేశవ్యాపిత నిరసన, కార్పొరేట్ అనుకూల విధానాలపై ఉద్యమాలు, సంఘ పరివార్ మతతత్వ రాజకీయాలపై ఆగ్రహం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు వస్తున్నాయి. దక్షిణాదిన కాలూనడం కష్టమైన బిజెపికి కర్ణాటక ఒక్కటే దింపుడు కళ్లెం ఆశ కాగా ఇప్పుడు అదీ ఎదురీతగా మారింది. కులాల కుంపట్లకు మారుపేరైన కర్ణాటకలో దాంతోపాటు మతతత్వ మంటలు రాజేసిన ఘనత బిజెపిదే. గత ముప్పై ఏళ్లలో ఒకసారి కూడా...అధికారంలోని సర్కారు మళ్లీ గెలవకపోవడం కర్ణాటక ప్రత్యేకత. దేవెగౌడ, కుమారస్వామి, జెడిఎస్ అవకాశవాద రాజకీయాల ఫలితంగా మొదటిసారి రాష్ట్రంలో అధికార భాగస్వామ్యం పొందిన బిజెపి తరపున యెడ్యూరప్ప ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనే లింగాయత్‌లను సమీకరించి, అవినీతి గని సామ్రాట్ గాలి జనార్ధనరెడ్డి వత్తాసుతో స్వంతంగా మంత్రివర్గం ఏర్పాటు చేశారు. అయితే కుంభకోణాల పరంపరలో వరుసగా మరో ముగ్గురు ముఖ్యమంత్రులు మారిపోవలసి వచ్చింది. ఒక దశలో యెడ్యూరప్ప కూడా తిరుగుబాటు చేసి స్వంత పార్టీ పెట్టుకున్నారు. కాని మళ్లీ 2018 ఎన్నికల నాటికి అన్యథా శరణం నాస్తి అంటూ ఆయననే మళ్లీ చేర్చుకోవడం బిజెపి దురవస్థకు అద్దం పడుతుంది. గత ఎన్నికల్లో పెద్ద పార్టీగా బిజెపి వచ్చినా ఎవరికీ మెజార్టీ దక్కలేదు. మెజార్టీ లేకున్నా యెడ్యూరప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, బలపరీక్ష రణరంగంగా మారడంతో తోక ముడవడం తెలిసినవే. కుమారస్వామిని ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేసినా దాన్ని బతకనివ్వలేదు. ఫిరాయింపుల ఆసరాతో మళ్లీ బిజెపి గద్దెక్కడం, బసవరాజ్ బొమ్మై ముఖ్యమంత్రి కావడం తెలిసిన విషయాలే.

అవినీతి, మతతత్వ ప్రజ్వలన

బొమ్మై పాలనతో కర్ణాటక పరిస్థితి దారుణంగా పరిణమించింది. ఉత్తరాది తరహా మతోన్మాద రాజకీయాలను రాజేసింది. ముస్లిం బాలికలు హిజాబ్ ధరించి రాకూడదనే ఆంక్షలు దేశంలోనే చిచ్చు పెట్టాయి. విద్యార్థులు ఏ మతానికి చెందిన వారైనా యూనిఫాం ఒకటే ధరించాలి గాని బురఖా



దక్షిణ భారతంలో కాంగ్రెస్ ప్రధాన శక్తిగా వున్న ఒకే ఒక రాష్ట్రం ఇదొక్కటే. ఆ విధంగా కర్ణాటక ఎన్నికల ప్రభావం జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బిజెపి ముఖాముఖి తలపడే చోట్ల పరిస్థితికి సంకేతాలుగా నిలుస్తాయి. కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్న దళిత నేత మల్లికార్జున ఖర్గే స్వంత రాష్ట్రం గనక ఇవి ఆయన వ్యక్తిగత ప్రతిష్టకు కూడా ఒక పరీక్షగా వుంటాయని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. దేశంలో మూడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడుపుతున్న కాంగ్రెస్‌కు ఇది చాలా కీలకమైన పరీక్ష. అంతర్గత విభేదాలు కూడా ఎక్కువే అయినా ఏకాభిప్రాయం వున్న 124 చోట్ల అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ ముందుగా రంగంలో నిలిచింది.

వేసుకోకూడదనే కొత్త షరతు విమర్శల పాలైంది. దీనిపై రాజ్యాంగ రీత్యా తమకు గల హక్కులను గురించి ముస్లిం సంస్థలు చేసిన పోరాటం, వాదోపవాదాల మధ్య విద్యా సంవత్సరమే దెబ్బతినిపోయింది. కర్ణాటక హైకోర్టు కూడా ఇందుకు మద్దతు తెల్పడంతో కేసు సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అక్కడ కూడా కొందరు న్యాయమూర్తులు మతపరమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ అది అపరిష్కృతంగానే వుంది. టిప్పు సుల్తాన్ జయంతి, విగ్రహ స్థాపన వంటి విషయాలపై సంఘ పరివార్ సృష్టించిన వివాదం మరో రభసకు దారితీసింది. దీనికి పరాకాష్టగా, ఎన్నికల తేదీ ప్రకటనకు కొద్దిగా ముందే హోం మంత్రి అమిత్ షా కర్ణాటకలో ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ ఎత్తివేస్తామని ప్రకటించారు. తమ హిందూత్వ రాజకీయాలకు దక్షిణ భారత దేశంలో కర్ణాటకను కేంద్రంగా చేసుకోవాలన్నదే ఇక్కడ దుర్నీతి. వీటన్నిటి ఫలితంగా రాష్ట్రంలో ఇస్లామిక్ తీవ్రవాద శక్తులు కూడా కొంత పట్టు సంపాదించడంతో బిజెపి మరింత వ్యతిరేతను రెచ్చగొట్టే అవకాశం కలిగింది. మతాంతర వివాహాలు, మత మార్పిళ్లు, చరిత్ర పాఠాల మార్పు వంటి నిర్ణయాలన్నీ ఇందుకే కారణమైనాయి. లింగాయత్‌లలో పట్టు పెంచింది యెడ్యూరప్ప అయినా ఆ సమీకరణాలలో కొత్త ఫార్ములాలు తీసుకురావాలన్న కోణంలోనే ఆయనను తప్పించి బొమ్మైని తీసుకొచ్చారు. ముస్లింలకు రద్దు చేసిన నాలుగు శాతం రిజర్వేషన్లలో వొక్కలింగ లింగాయత్ రిజర్వేషన్ రెండు శాతం చొప్పున కోటా ఇవ్వడం ఇందులో భాగమే. దీనివల్ల ఆ తరగతులు కూడా సంతృప్తి చెందింది లేదు. ముఖ్యమంత్రి ఇంటి దగ్గర నిరసనలు కూడా జరిగాయి. అధిష్టానం తనను దూరం పెట్టడం జీర్ణించుకోలేని యెడ్యూరప్ప అసంతృప్తి శిబిరం నడిపించారు. ఆఖరుకు ప్రధాని మోడీ స్వయంగా వచ్చి ఆయనను బహిరంగ వేదికపై పొగిడి బుజ్జగించాల్సి వచ్చింది. అవినీతి ఏ స్థాయికి చేరిందంటే కాంట్రాక్టర్ల సంఘం తాము 40 శాతం కమీషన్లు భరించలేక బహిరంగ ప్రకటన చేసింది. ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు ముందే 93 కోట్లు అక్రమ ధనం పట్టుపడటం దీనికో ఉదాహరణ. ఇదేగాక గిడ్డంగులలో గుట్టలు పేర్చిన మద్యం, ఖరీదైన కానుకలు భారీ ఎత్తున పట్టుపడ్డాయి. ఇవి బిజెపి జాతీయ కార్యదర్శిగా వున్న ఎంఎల్ఎ సి.టి.రవికి సంబంధించినవిగా తేలింది. కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జంట్స్ లిమిటెడ్ చైర్మన్‌గా వున్న మదల్ విరూపాక్షను లోకాయుక్త అభిశంసించగా ముందస్తు బెయిల్ కూడా రద్దయి అరెస్టయ్యారు. అనేక అక్రమ లావాదేవీలలో అనుమానితుడుగా వున్న మరో దళారీ అనుమానాస్పద పరిస్థితులలో మరణించారు.

కాంగ్రెస్ ఆశలు, సవాళ్లు

బొమ్మై సర్కారు పట్ల ప్రజల్లో అసంతృప్తి తీవ్రంగానే వుందని పరిశీలకులు అంచనా వేస్తుంటే అదే తమకు లాభిస్తుందని కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్‌కు ఎస్‌సి, ఎస్‌టిలు, వక్కలిగలు ప్రధాన మద్దతుదారులుగా వున్నారు. సిద్దరామయ్యతో సహా బలమైన గుర్తింపు గల నాయకులు కూడా కాంగ్రెస్‌లో వున్నారు. మధ్యలో జెడిఎస్ కూడా పరిమిత ప్రాంతాలలో వక్కలిగలలో పట్టు కలిగివున్నా ఆ ప్రభావం తగ్గుముఖంలో వుంది. పలుసార్లు రాజకీయ పొత్తులు మార్చిన ఆ పార్టీకి విశ్వసనీయతా లోపం కూడా వుంది. దక్షిణ భారతంలో కాంగ్రెస్ ప్రధాన శక్తిగా వున్న ఒకే ఒక రాష్ట్రం ఇదొక్కటే. ఆ విధంగా కర్ణాటక ఎన్నికల ప్రభావం జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బిజెపి ముఖాముఖి తలపడే చోట్ల పరిస్థితికి సంకేతాలుగా నిలుస్తాయి. కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్న దళిత నేత మల్లికార్జున ఖర్గే స్వంత రాష్ట్రం గనక ఇవి ఆయన వ్యక్తిగత ప్రతిష్టకు కూడా ఒక పరీక్షగా వుంటాయని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. దేశంలో మూడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడుపుతున్న కాంగ్రెస్‌కు ఇది చాలా కీలకమైన పరీక్ష. అంతర్గత విభేదాలు కూడా ఎక్కువే అయినా ఏకాభిప్రాయం వున్న 124 చోట్ల అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ ముందుగా రంగంలో నిలిచింది.

20 చోట్ల తెలుగు ముద్ర

కర్ణాటకకూ తెలుగువారికి సంబంధాలు చారిత్రికమైనవి. తెలుగు వారి సంఘాలు, తెలుగు నాట గల పార్టీలపట్ల అనుకూల ప్రతికూలతలు అక్కడ సర్వసాధారణం. మొత్తం కోటి మంది వరకూ తెలుగువారు అక్కడ వున్నారని, బెంగళూరులోనే పాతిక లక్షల వరకూ వుంటారని తెలుగు సంఘాలు చెబుతుంటాయి. మైసూర్ కర్ణాటక, హైదరాబాద్ కర్ణాటక, బెంగళూరు కర్ణాటక అని మూడు భాగాలుగా పిలుస్తుంటారు. జెడిఎస్ నాయకుడు కుమారస్వామి కెసిఆర్‌తో కలవడమే గాక బిఆర్‌ఎస్ ప్రారంభ సభకూ హాజరైనారు. అక్కడ ఆ పార్టీ పోటీ చేస్తుందని కూడా కథనాలు వచ్చాయి కాని తర్వాత లేదని వివరణ ఇచ్చారు. జెడిఎస్ వంటిరిగా పోటీ చేస్తే పొత్తు పెట్టుకోవడమో బలపర్చడమో చేయొచ్చని బిఆర్‌ఎస్ నాయకులు వెల్లడించారు. తాము స్థానిక ఎన్నికలలో మాత్రం పోటీ చేస్తామన్నారు. 20 నియోజక వర్గాలలో తెలుగువారే నిర్ణాయక శక్తిగా వుంటారని చెబుతున్నారు. ఇందులో ఒకటైన బాగేపల్లి గతంలో సిపిఎం గెలుచుకున్నది. ఇప్పుడు కూడా అక్కడ సన్నాహాల కోసం బి.వి.రాఘవులు, ఎం.ఎ.బేబీ పర్యటించారు. ఎ.పి బయట తాము జోక్యం చేసుకోమని వైసిపి చెబుతున్నా టిడిపి పరోక్షంగానైనా ఏదైనా చేయొచ్చనే అభిప్రాయం వుంది. అక్కడ తమ పార్టీని గెలిపించేందుకు సహకరించాలని ఎ.పి ముఖ్యమంత్రి జగన్‌ను హోంమంత్రి అమిత్ షా ఇటీవల కోరారనే కథనాలు వున్నాయి. మజ్లిస్ కూడా రంగంలో వుంటుంది. ఆప్ కూడా దాదాపు అన్ని స్థానాలలో పోటీ చేస్తానని ప్రకటించడంతో ఓట్ల చీలిక ఇంకా పెరుగుతుందనే అంచనాలు వున్నాయి.

> ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నాయకత్వ లోపం కారణంగా ఈ సారి తాము గెలిచే అవకాశం లేదని బిజెపి నేతలు చాలామంది ఒప్పుకుంటున్నారు. ఆరెస్సెస్ నేతల అంచనా కూడా అలాగే వుంది. అందుకే రాష్ట్రంలో మోడీ, అమిత్ షా వంటి వారు విస్తారంగా పర్యటించి గట్టెక్కించాలని తంటాలు పడుతున్నారు. మోడీనే తమ ఎన్నికల ముఖచిత్రంగా వుంటారని బిజెపి నేతలు చెప్పడానికి కారణమదే. కాంగ్రెస్ జాతీయ నేతలు కూడా పర్యటనలకు సిద్ధమవుతున్నారు. తనపై పరువునష్టం కేసుకు శిక్ష, అనర్హతలకు కారణమైన కోలార్ నియోజకవర్గం నుంచే రాహుల్ గాంధీ పర్యటన ప్రారంభిస్తున్నారని సమాచారం.

పర్యటనల జోరు

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నాయకత్వ లోపం కారణంగా ఈ సారి తాము గెలిచే అవకాశం లేదని బిజెపి నేతలు చాలామంది ఒప్పుకుంటున్నారు. ఆరెస్సెస్ నేతల అంచనా కూడా అలాగే వుంది. అందుకే రాష్ట్రంలో మోడీ, అమిత్ షా వంటి వారు విస్తారంగా పర్యటించి గట్టెక్కించాలని తంటాలు పడుతున్నారు. మోడీనే తమ ఎన్నికల ముఖచిత్రంగా వుంటారని బిజెపి నేతలు చెప్పడానికి కారణమదే. కాంగ్రెస్ జాతీయ నేతలు కూడా పర్యటనలకు సిద్ధమవుతున్నారు. తనపై పరువునష్టం కేసుకు శిక్ష అనర్హతలకు కారణమైన కోలార్ నియోజకవర్గం నుంచే రాహుల్ గాంధీ పర్యటన ప్రారంభిస్తున్నారని సమాచారం. సోనియా గాంధీ కూడా బాధ్యతల విరమణ యోచన తాత్కాలికంగా వాయిదా వేసినట్టు చెబుతున్నారు. 1977-78లో ఇందిరాగాంధీకి కర్ణాటక అండగా నిలిచినట్టే ఇప్పుడూ తోడు కావచ్చనే ఆశ లేకపోలేదు. 2018లో బిజెపికి 104 సీట్లు 36.35 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 78 సీట్లు 38.14 శాతం ఓట్లు వస్తే, జెడిఎస్‌కు 37 సీట్లు 18.3 శాతం ఓట్లు రావడం అక్కడ తీవ్ర విభజనను తెల్పుతుంది. జెడిఎస్ ప్రభావాన్ని మరింత తగ్గించి ఆ స్థానంలో తాను ప్రవేశించాలనేది బిజెపి వ్యూహంలో ఒక ముఖ్యాంశం. ఈ ఫలితాల ప్రభావం వెంటనే జరిగే తెలంగాణ ఎన్నికలపైనా 2024 లోక్‌సభ సమరంపైనా ప్రభావం చూపించడం ఖాయం. కనుకనే కర్ణాటకలో బిజెపిని అధికారానికి దూరం చేయడం ప్రతిపక్షాల ఉమ్మడి లక్ష్యంగా వుంది. ఇందులో ఎవరి వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయనేది ఓటర్లే తేల్చి చెబుతారు.

★

రైతును ముంచుతున్న ప్రకృతి శాపాలు, పాలకుల విధానాలు

విశ్లేషణ

వి. రాంభూపాల్

మార్చి నెలలో రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో భారీ గాలులు, వడగళ్ల వర్షాలు రైతులను నిట్టనిలువునా ముంచాయి. చేతికి వచ్చిన పంటలు కొద్ది నిమిషాల్లోనే నేలపాలయ్యాయి. కోట్ల రూపాయల రైతుల పెట్టుబడి మట్టిలో కలిసిపోయింది. దాంతో రైతు కుటుంబాల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కూడా ఈ వడగళ్ల వర్షాలకు తీవ్రంగా నష్టపోయాయి. ప్రకృతి వైపరీత్యాల పేరుతో తరాల నాడు రూపొందించుకున్న నిబంధనలే నేటికీ అమలవుతున్నాయి. అసాధారణ పరిస్థితుల వల్ల రైతు అసాధారణంగా నష్టపోతే ప్రభుత్వాలు చేసే సహాయం కూడా అసాధారణంగా వుండాలనే కనీస విజ్ఞతను పాలకులు పాటించడంలేదు.

రాష్ట్రంలో వడగళ్ల వానల వల్ల 3 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించారు. అనంతపురం జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వడగళ్ల వానల వల్ల అరటి, మామిడి, బత్తాయి, పుచ్చకాయ, బొప్పాయి, టమోటా, మిరప, మొక్కజొన్న, వరి పంటలు భారీగా నష్టపోయాయి. ఇందులో ఉద్యానవన పంటలు 4,843 ఎకరాలు, ఇతర పంటలు 7,525 ఎకరాల్లో నష్టపోయినట్లు జిల్లా అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వాస్తవ పరిస్థితి ఇంతకు రెండింతలు వుంటుంది. శ్రీసత్య సాయి, కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షల ఎకరాల్లో పంటల నష్టం జరిగింది. పొరుగున వున్న తెలంగాణ రాష్ట్రంలో పంట నష్టం అంచనా వేసి, ఎకరాకు రూ. పది వేల నష్టపరిహారాన్ని ప్రకటించింది అక్కడి ప్రభుత్వం. మనకు మాత్రం పరిహారం ఎంత ఇస్తారో ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వడంలేదు.

పంట నష్టం అంచనా - ద్వంద్వ ప్రమాణాలు

అనంతపురం జిల్లాలో 16 మండలాల్లోని 46 గ్రామాల్లో 4,843 ఎకరాల్లో ఉద్యానవన పంటలు నష్టపోయాయి. ఇందులో ఒక్క అరటి పంట 2,769.4 ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఒక ఎకరా అరటి సాగుకు కనీస పెట్టుబడి ఖర్చు రూ.లక్ష 30 వేలు అవుతుంది.

ఈ లెక్కన ప్రస్తుత పంట పెట్టుబడి నష్టం రూ.36 కోట్లు. ప్రస్తుత ధర ప్రకారం దిగుబడి ఆదాయం కలిపితే సుమారు రూ.వంద కోట్లకు పైగా వుంటుంది. అయితే రూ. 6,655 కోట్లు మాత్రమే నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. పంటల పెట్టుబడి ఖర్చు ఆధారంగా ఇచ్చే బ్యాంకు రుణాలు, పంటల నష్టం ఆధారంగా ప్రభుత్వాలు లేదా ఇన్సూరెన్స్ కంపెనీలు చెల్లించే పరిహారాల విషయంలో ద్వంద్వ ప్రమాణాలను ప్రభుత్వాలు రూపొందించుకున్నాయి. ఉదా: అరటి పంట ఎకరా సాగుకు బ్యాంకులు ఇచ్చే రుణ సదుపాయం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా ఎకరాకు రూ.లక్ష 25 వేలు, పంట నష్టం అంచనా మాత్రం హెక్టారు (రెండున్నర ఎకరాల)కు రూ.25 వేలు. వరి ఎకరా సాగుకు రూ. 35 వేలు ఖర్చు అవుతుంటే, పంట పూర్తిగా నష్టపోతే రూ. 8,433గా అంచనా వేశారు. కోస్తా జిల్లాలో మిర్చి పంట సాగుకు ఎకరాకు రూ.2.50 లక్షల నుండి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కాని ప్రభుత్వం రూపొందించుకున్న నిబంధనల ప్రకారం నామమాత్రపు పరిహారం అందేలా వుంది. చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో భీకర గాలులతో మామిడి కాయలు పెద్ద ఎత్తున రాలిపోయాయి. నేల రాలిన మామిడి కాయల ఆధారంగా పంట నష్టం అంచనా వేయడానికి నిబంధనలు అంగీకరించవు. ఇలాగే మొక్కజొన్న తదితర పంటల నష్టానికి, పరిహారం అందించేందుకు రూపొందించుకున్న నిబంధనలకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా వుంది. అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వేసిన అంచనాల విలువ మొత్తాన్ని ప్రభుత్వం అరటి రైతులకు చెల్లించిన రైతు నష్టంలో కేవలం ఆరు శాతం మాత్రమే అవుతుంది. నష్టంలో ఆరు శాతం మాత్రమే చెల్లించి రైతులను ఆదుకుంటామనే ప్రభుత్వాలు రైతు ప్రభుత్వాలు ఎలా అవుతాయి?

> పంట నష్టపోవడం అంటే రైతు పెట్టుబడి నష్టంతో పాటు...అప్పుల భారం, ప్రజలకు ఆహార సరుకుల కొరత, ధరల పెరుగుదల వంటి అనేక రూపాల్లో దీని ప్రభావం వుంటుంది. అందుకే రైతుకు పరిహారం అందించడం సామాజిక బాధ్యత. పంటల నష్టానికి న్యాయమైన పరిహారం కోసం పోరాడాలి.

ఉద్యానవనశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేశారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతుల పేర్లు నమోదు చేస్తున్నారు. ముందస్తు కౌలు చెల్లించి, పంట పెట్టుబడి పెట్టే వాస్తవ సాగుదార్లయిన కౌలు రైతులకు...ప్రభుత్వాలు చెల్లించే నష్టపరిహారం ఒక్క రూపాయి కూడా అందదు.

పంటల బీమా రైతులకా? కంపెనీలకా?

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని దేశ ప్రజలకు హామీ ఇచ్చి బిజెపి వారు అధికారంలోకి వచ్చారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా లాంటి వాటి ద్వారా పంటల నష్టానికి పరిహారం చెల్లించడం, రైతులకు బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు భారీగా ఇవ్వడం తమ విధానంగా ప్రకటించారు. బిజెపి నేతల మాటలకు చేతలకు ఎంత వ్యత్యాసం వుంటుందో అనేక విషయాల్లో రుజువవుతూనే వుంది. వ్యవసాయ రంగంలో మరింత స్పష్టంగా బట్టబయలవుతున్నది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే...పంటల బీమా కోసం 2017-18 సంవత్సరంలో ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎం.ఎఫ్.బి.వై) ద్వారా పరిహారం చెల్లిస్తామన్నారు. ఈ బీమా పథకం అమలు కోసం 13 ప్రయివేటు సంస్థలతో సహా 18 సాధారణ బీమా కంపెనీలను ప్రభుత్వం ఇందులో చేర్చుకున్నది. ఈ పథకం కింద ఖరీఫ్ పంటలకు ప్రీమియంలో 2 శాతం, రబీ పంటలకు 5 శాతం రైతులు చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. 2016-17 నుండి 2020-21 వరకు ప్రయివేటు బీమా కంపెనీలు ప్రీమియంగా రూ. 69,667 కోట్లు పొంది, రూ. 45,317 కోట్లు పరిహారంగా రైతులకు చెల్లించి, రూ. 24,350 కోట్లు రూపాయలు లాభపడ్డాయి. ఇందులో ఒక్క అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ అత్యధికంగా రూ. 4,731 కోట్లు లాభపడింది.

వ్యవసాయ రుణాల విధానాలను పరిశీలిద్దాం. 2019-20లో రూ.9 లక్షల కోట్లు, 2020-21లో రూ.11 లక్షల కోట్లు, 2021-22లో రూ. 16 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలను ప్రకటించారు. ఆచరణలో గౌతమ్ అదానీ లాంటి ఐదు బడా కార్పొరేట్ కంపెనీలు నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజ్‌లు, మాల్స్, సోలార్, విండ్ మిల్లుల విద్యుత్ కంపెనీలకు ఇచ్చే రుణాలను కూడా వ్యవసాయ రుణాలుగా మార్చారు. ప్రతి బ్యాంకు తన వ్యాపార ధనంలో 40 శాతం వ్యవసాయ రుణాలు ఇవ్వాలని, అందులో 18 శాతం పంట రుణాలు వుండాలని 1965లో రూపొందించుకున్న రిజర్వుబ్యాంకు విధానాన్ని 1991 వరకు అమలు చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్య తరగతి రైతులకు అందాల్సిన వ్యవసాయ రుణాల్లోకి బడా కంపెనీలు జొరబడి దోచుకునేటట్లు విధానాలను మార్చారు.

కేంద్ర విధానాలపై నోరెత్తని రాష్ట్ర పాలకులు

రైతులకు తీవ్ర నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఏ మాత్రం ప్రశ్నించక పోగా, వ్యవసాయ విద్యుత్ మీటర్ల ఏర్పాటు లాంటి విధానాలను అమలు చేసి రైతులపై భారాలు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతున్నది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే మూడు నల్ల చట్టాలను పార్లమెంట్‌లో బలపరచి, వీధుల్లో రైతు ఉద్యమాలను బలపరిచే ద్వంద్వ విధానాలను రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు అనుసరించాయి.

పంట నష్టపోవడం అంటే రైతు పెట్టుబడి నష్టంతో పాటు...అప్పుల భారం, ప్రజలకు ఆహార సరుకుల కొరత, ధరల పెరుగుదల వంటి అనేక రూపాల్లో దీని ప్రభావం వుంటుంది. అందుకే రైతుకు పరిహారం అందించడం సామాజిక బాధ్యత. పంటల నష్టానికి న్యాయమైన పరిహారం కోసం పోరాడాలి. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న 14.57 కోట్ల మంది రైతులు, 20 కోట్ల మంది వ్యవసాయ కూలీలను ఐదారు కార్పొరేట్ కంపెనీలకు బలిపెట్టే ప్రభుత్వ విధానాలను ఐక్యంగా ప్రతిఘటించడం ద్వారానే వ్యవసాయాన్ని కాపాడుకోగలం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు /

జనవాక్యం

అతి వేగం అనర్థం

రాహుల్ గాంధీపై పార్లమెంట్ అనర్హత వేటు వెయ్యడం అనుచితం. పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే వెంటనే ఆ తీర్పుని, శిక్షని ఒక నెల పాటు అమలు కాకుండా సస్పెండ్ చేసింది. ఆ తీర్పుపై అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోర్టు ఉద్దేశ్యం. అది ముద్దాయి హక్కు కూడా. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా చట్టసభల్లోని సభ్యుడు ఏదైనా కేసులో రెండేళ్లు, అంతకు మించి జైలు శిక్షకు గురైతే వెనువెంటనే ఆ సభ్యత్వానికి అనర్హుడు అయ్యే వీలుంది. ఇక్కడ రాహుల్ గాంధీ విషయంలో జరిగింది తప్పు అనలేం. ఎందుకంటే చట్టం ప్రకారం అనర్హత అవకాశం ఉంది. అలా అని సమర్థించలేం. ఎందుకంటే కోర్టు చెప్పిన సగం మాటని పరిగణన లోకి తీసుకుని మిగతా సగం వదిలేయబడ్డది. శిక్షని గమనం లోకి తీసుకున్న పార్లమెంట్, ఆ శిక్షపై అదే కోర్టు విధించిన ఒక నెల గడువుని విస్మరించింది. ఆగమేఘాల మీద ఆయనని అనర్హుడిని చేసింది. ఈ అత్యుత్సాహం అవసరం లేదు. ఎందుకంటే అవినీతి, కరడుగట్టిన నేరం లాంటి సీరియస్ కేసులో ఆయనకు శిక్ష పడలేదు. మరో వైపు ఆయన ఎదుర్కొన్న కేసులో రెండేళ్ళన్నది గరిష్ట శిక్ష. పార్లమెంట్‌లో అనర్హుడు అవ్వడానికి కనీస శిక్ష అది. ఆ రకంగా చూసినా కేసుకి సంబంధించి ఆయన గరిష్ట శిక్షకు పాత్రుడయ్యే విషయంలో కోర్టు పరిశీలించడానికి ఎక్కువ అవకాశం ఉంది. ఈ విషయాలన్నీ బేరీజు వేసుకుని పార్లమెంట్ తొందర పడకుండా ఉండాల్సింది. శిక్షపై ఉన్న సస్పెన్షన్ గడువు తీరేవరకైనా ఆగాల్సింది.

- డా.డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

రిజర్వు ఫారెస్టుల్లో కమర్షియల్ మైనింగ్

- క్యాప్టివ్ బ్లాక్‌ల నుంచి తవ్వకాలకు కేంద్రం ఓకే
- గతనెల 17నే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సర్క్యులర్
- 2021లోనే సంబంధిత చట్టాన్ని సవరించిన మోడీ సర్కారు
- తాజాగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ క్లియరెన్సులు
- ఆదివాసీల హక్కులను హరించడమే : పర్యావరణ వేత్తలు, సామాజిక కార్యకర్తలు

దేశంలోని మోడీ సర్కారు ప్రకృతి వనరులను ప్రయివేటు మైనింగ్ కంపెనీలకు కట్టబెడుతున్నది. సదరు కంపెనీల ప్రయోజనాల ధ్యేయంగా పని చేస్తున్నది. ఇందుకు పర్యావరణ పరిస్థితులను సైతం లెక్క చేయడం లేదు. ముఖ్యంగా, అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే పలు తెగల ప్రజలు, రిజర్వ్ ఫారెస్టుల్లో ఉండే జంతువుల మనుగడను కూడా పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. తాజాగా రిజర్వు ఫారెస్టుల్లోని క్యాప్టివ్ బ్లాక్‌ల నుంచి కమర్షియల్ మైనింగ్‌కు మోడీ ప్రభుత్వం అనుమతించింది. ఈ నిర్ణయం భారత రాజ్యాంగం అక్కడుండే ఆదివాసీ హక్కులకు కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ : కమర్షియల్ మైనింగ్‌కు సంబంధించి గతనెల (మార్చి) 17నే కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సర్క్యులర్‌ను సైతం జారీ చేసింది. పరిమితులకు లోబడి ఒక ఏడాదిలో వెలికితీసిన మొత్తం మినరల్స్‌లో 50 శాతం వరకు అమ్ముకునేలా రిజర్వు ఫారెస్టుల్లోని మైన్‌లకు చెందిన లీజుదారులకు అనుమతులు ఇవ్వాలనీ రాష్ట్రాలను అందులో ఆదేశించింది. ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ (ఎఫ్‌ఏసీ) సిఫారసులపై ఆధారపడి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు (ఎంఒఇఎఫ్‌సిసి) ఈ సర్క్యులర్‌ను జారీ చేసింది. రిజర్వ్ ఫారెస్టులోని క్యాప్టివ్ బ్లాక్‌ల మైనింగ్ నుంచి సేకరించిన ఖనిజాల వాణిజ్య విక్రయంపై గతంలో ఉన్న పరిమితులను అందులో సడలించింది.

గతంలోనే చట్ట సవరణ

ఈ సర్క్యులర్‌కు ముందే మోడీ ప్రభుత్వం మైనింగ్ కంపెనీలకు అనుకూలంగా క్షేత్రస్థాయిలో అంతా సిద్ధం చేసి ఉంచింది. తవ్వకాలు మరియు ఖనిజాలు (అభివృద్ధి మరియు నియంత్రణలు) నిబంధనలు, 1957 చట్టాన్ని 2021 మార్చిలో మోడీ ప్రభుత్వం ఇప్పటికే సవరించింది. దీంతో సర్క్యులర్‌లో పేర్కొన్నట్టుగా రిజర్వ్ ఫారెస్టుల్లోని క్యాప్టివ్ బ్లాక్‌ల నుంచి తవ్వకాలు జరిపి వెలికితీసిన ఖనిజాల వాణిజ్య విక్రయానికి ఇది మార్గం సుగమం చేసింది. అయితే, రిజర్వు ఫారెస్టుల్లో క్యాప్టివ్ బ్లాక్‌ల నుంచి కమర్షియల్ మైనింగ్‌కు కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ సైతం క్లియరెన్సులు ఇవ్వడంతో దీనికి సంబంధించిన పూర్తి తంతు ముగిసినట్టయ్యింది.

మైనింగ్ కంపెనీల ప్రయోజనాలే ముఖ్యం

కేంద్రం నిర్ణయంపై ఇటు పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, జంతు ప్రేమికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మైనింగ్ కంపెనీ యజమానుల లాభాలే ధ్యేయంగా మోడీ ప్రభుత్వం వారికి అనుకూలంగా పని చేస్తున్నదనీ, ప్రజాప్రయోజనాలు, పర్యావరణ నష్టాన్ని గాలికొదిలేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల్లో కమర్షియల్ మైనింగ్‌కు గేట్లు ఎత్తడం ద్వారా మోడీ సర్కారు అక్కడి జీవావరణాన్ని, వన్య ప్రాణులను ప్రమాదంలోకి నెట్టేస్తున్నదని పర్యావరణవేత్తలు హెచ్చరించారు. ఈ మైనింగ్‌తో అధిక మొత్తంలో ఖనిజ దోపిడీ జరుగుతుందని లాభాపేక్షలేని పర్యావరణ సంస్థ కన్జర్వేషన్ యాక్షన్ ట్రస్టుకు చెందిన దెబీ గోయెంకా ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీలు ఆర్థిక లాభాలే ధ్యేయం పని చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తాయన్నారు.

అటవీ హక్కు చట్టం ఉల్లంఘన

ప్రకృతి వనరులు ప్రయివేటు కంపెనీలు, ప్రభుత్వానికి చెందవనీ, అవి దేశ ప్రజలకు చెందుతాయని దేశ సర్వోన్నత న్యాయస్థానం గతంలోనే స్పష్టం చేసిందనీ మైనింగ్ ద్వారా ప్రభావితమయ్యే తెగల కూటమి చైర్‌పర్సన్ రెబ్బాప్రగడ రవి అన్నారు. క్యాప్టివ్ మైన్‌ల నుంచి తవ్వకాలకు పబ్లిక్, ప్రయివేటు రంగ సంస్థలకు ఏకపక్షంగా అనుమతులిస్తున్నదనీ, కేంద్రం ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తున్నదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నదని రవి ఆందోళన వెలిబుచ్చారు. భారత రాజ్యాంగం ఆదివాసీ తెగలకు కల్పించిన హక్కులను ఇది ఉల్లంఘిస్తుందని నిపుణులు అన్నారు. క్యాప్టివ్ మైన్‌ల నుంచి వెలికి తీసిన ఖనిజాల వాణిజ్య అమ్మకం, తవ్వకాలకు సంబంధించి అక్కడి స్థానిక తెగల నుంచి అనుమతి తప్పనిసరనీ, అలా చేయకపోవడం పీసా చట్టం, 1995, అటవీ హక్కుల చట్టం, 2006ను ఉల్లంఘించడమేనని రవి తెలిపారు.

మలేషియాతో రూపాయల్లో వాణిజ్యం

న్యూఢిల్లీ : మలేషియాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం ఇక రూపాయల్లో జరగనుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. ప్రపంచ దేశాల మధ్య అంతర్జాతీయ చెల్లింపులను రూపాయల్లో చేయడానికి గతేడాది జులైలోనే ఆర్‌బిఐ అనుమతులిచ్చింది. ఇప్పటికే రష్యా, మారిషస్, శ్రీలంక దేశాలతో ఎగుమతులు, దిగుమతుల లావాదేవీలు రూపాయల్లో జరుగుతున్నాయి. మలేషియాతో వాణిజ్యం ప్రస్తుతమున్న కరెన్సీలతో పాటు రూపాయల్లోనూ జరగనుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇందుకోసం కౌలాలంపూర్‌లోని ఇండియా ఇంటర్నేషనల్ బ్యాంక్ ఆఫ్ మలేషియా(ఐఐబిఎం), భారత్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి ప్రత్యేక రూపీ వోస్ట్రో ఖాతాలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.

ఐఐటి మద్రాస్‌లో పిహెచ్‌డి విద్యార్థి ఆత్మహత్య

వేలచేరి : ఐఐటి మద్రాస్‌లో పిహెచ్‌డి చేస్తున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన సచిన్ కుమార్ జైన్ (31) స్థానికంగా ఓ అద్దె ఇంట్లో ఉంటూ ఐఐటి మద్రాస్‌లో పిహెచ్‌డి చేస్తున్నాడు. శుక్రవారం యథావిధిగా గిండీ క్యాంపస్‌లో తరగతులకు హాజరయ్యాడు. మధ్యలో ఎవరికీ చెప్పకుండా తన గదికి వచ్చేశాడు. గంటసేపైనా జైన్ క్లాసుకు తిరిగిరాకపోవడాన్ని గమనించిన స్నేహితులు అతడి గదికి వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు ముందు సచిన్ కుమార్ జైన్, వాట్సాప్‌లో "నన్ను క్షమించండి, ఇది సరిపోదు" అని స్టేటస్ పెట్టాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

సాయుధ బలగాల సన్నద్ధతపై మోడీ సమీక్ష

న్యూఢిల్లీ : సాయుధ బలగాల నిర్వహణా సన్నద్ధతను ప్రధాని మోడీ శనివారం సమీక్షించారు. కొత్తగా తలెత్తబోయే ముప్పులను ఎదుర్కొనడానికి సిద్ధంగా వుండాలని త్రివిధ దళాలను ప్రధాని కోరారు. సాయుధ బలగాలకు అవసరమైన ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాలను సమకూర్చడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భోపాల్‌లో కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ ముగింపు ఉపన్యాసంలో ప్రధాని ప్రసంగించారు. ఈ ఏడాది సమావేశంలో చర్చకు వచ్చిన వివిధ అంశాలను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనీల్ చౌహాన్ ప్రధానికి వివరించారు.

బీహార్‌లోని నాలుగు జిల్లాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తత

- కారకులపై చర్యలు తీసుకోవాలని నితీష్ ఆదేశాలు

పాట్నా : బీహార్‌లోని రోహ్‌తాస్, నలందా, భాగల్పూర్, గయ జిల్లాల్లో శనివారం కూడా ఉద్రిక్తతలు కొనసాగాయి. రామనవమి ఉత్సవాల సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ మూకలు ఉద్రిక్తతలు రెచ్చగొట్టడంతో ఘర్షణలు చెలరేగాయి. నలంద, రోహ్‌తాస్, బీహార్‌షరీఫ్ జిల్లా కేంద్రాల్లో 144వ సెక్షన్ విధించారు. సాసారం, నలంద పట్టణాల్లో ఆదివారం వరకు ఇంటర్‌నెట్ సర్వీసులు నిలిపివేశారు. భద్రతా బలగాలను భారీగా మోహరించారు. శుక్రవారం నుంచి ఈ రెండు పట్టణాల్లో మార్కెట్లు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఘర్షణల అనంతరం గయలోని చకంద్ బ్లాక్‌లో గల గ్రామాల్లో, భాగల్పూర్‌లోని నుగాచియా పట్టణంలో అధికారులు అదనపు భద్రతా బలగాలను మోహరించారు. ఇప్పటివరకు పోలీసులు 53 మందిని అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ, కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే సమస్యను సృష్టించినట్లు కనిపిస్తోందని అన్నారు. కారకులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదన్నారు.

మసీదు సమీపంలో పాలస్తీనా యువకుడి హత్య

జెరూసలేం : అల్ అక్సా మసీదు కాంపౌండ్ ప్రవేశ మార్గం వద్ద ఇజ్రాయిలీ పోలీసులు శనివారం పాలస్తీనా యువకుడిని కాల్చి చంపారు. మృతుడిని దక్షిణ ఇజ్రాయిల్‌లోని హౌరా గ్రామానికి చెందిన మహ్మద్ ఖలీద్ (26)గా గుర్తించారు. అల్ అక్సా మసీదు కాంపౌండ్‌కు వెళ్లే చెయిన్ గేట్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఆ యువకుడిపై పోలీసులు పదిసార్లు కాల్చారని మసీదు వద్ద గల పాలస్తీనియన్లు తెలిపారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

బి లక్ష్మీరాజ, నాగమణి, కోశాధికారి బి గోపిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి : యుటిఎఫ్

రాష్ట్రంలో ఉపాధ్యాయులపై ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్‌లో చేసిన తీర్మానాలను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే కేసులు పెట్టడం తగదని అన్నారు. సిపిఎస్ రద్దు, పాఠశాలల విలీనం నేపథ్యంలో జరిగిన ఉద్యమాల్లో ఉపాధ్యాయులపై అక్రమంగా నోటీసులు ఇవ్వడం, కేసులు పెట్టడం వంటి చర్యలకు పూనుకుందని అన్నారు. ఉపాధ్యాయులపై వున్న అన్ని రకాల కేసులనూ ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

కేంద్రంపై నిప్పులు చెరిగిన సిద్ధు: జైలు నుంచి విడుదల

ఛండీగఢ్ : పంజాబ్ కాంగ్రెస్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ పటియాల సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చినవెంటనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 34 ఏళ్ల కిందటి ఓ కేసులో ఆయనకు ఏడాది జైలు శిక్ష పడడంతో గత సంవత్సరం మే నెలలో ఆయన జైలు కెళ్లారు. జైలులో సత్ప్రవర్తన కారణంగా కొంచెం ముందుగానే జైలు నుంచి ఆయనను విడుదలజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసిందని, రాజ్యాంగ సంస్థలను ప్రభుత్వానికి ఊడిగం చేసేవిగా మార్చేస్తున్నదని ఘాటుగా విమర్శించారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుందని అన్నారు. దేశంలో నియంతృత్వం తలెత్తినప్పుడు విప్లవం వస్తుంది. ఆ విప్లవం పేరే రాహుల్ అని ఆయన అతిశయంగా చెప్పారు. చర్చ, అసమ్మతి అనేవి ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలని, అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు యత్నిస్తోందని సిద్ధు విమర్శించారు. దేశంలో సిక్కులు మైనార్టీలుగా ఉన్నారని, పంజాబ్‌లో మైనార్టీలు మెజార్టీగా ఉన్న చోట ఆ ప్రభుత్వాన్ని కూల్చేసేదాకా కేంద్రం నిద్దరపోదని ఆయన ఎద్దేవా చేశారు. ఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని అయినా కేంద్రం కూల్చాలనుకుంటే మొదట అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తుంది, ఆ తరువాత దానిని తన గుప్పెట్లో పెట్టుకుంటుందని సిద్ధూ అన్నారు. మీరు పంజాబ్‌ను బలహీనపరచాలనుకుంటే మీరు (కేంద్రం) కూడా బలహీనపడతారని బిజెపినుద్దేశించి ఆయన అన్యాపదేశంగా అన్నారు.

కళాక్షేత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల కేసు

చెన్నై : చెన్నైలోని కళాక్షేత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ హరి పద్మన్‌పై చెన్నై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కళాక్షేత్ర ఫ్యాకల్టీ సభ్యుడు, ముగ్గురు థియేటర్ కళాకారులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, బాడీ షేమింగ్ చేస్తున్నారని, అసభ్య పదజాలంతో తిడుతున్నారని దాదాపు 200మంది విద్యార్థినులు గత గురువారం నుంచి ఆందోళన చేస్తున్నారు. సాంప్రదాయ కళలకు పెట్టింది పేరైన, అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలో లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కళాక్షేత్ర ఫ్యాకల్టీ సభ్యుడికి, థియేటర్ కళాకారులకు వ్యతిరేకంగా దాదాపు 90మంది విద్యార్థినులు తమిళనాడు మహిళా కమిషన్ చీఫ్‌కు శుక్రవారం రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో కొన్నేళ్ల నుంచి లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. సంస్థ డైరెక్టర్, ఇతర అధికారులతో తమ సమస్య గురించి చెప్పుకున్నా, ఫిర్యాదు చేసినా టిసి తీసుకుని వెళ్లిపోమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నలుగురినీ తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఇన్ని నేరాలు జరుగుతున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న సంస్థ డైరెక్టర్ రేవతి రామచంద్రన్‌ను తొలగించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక మంత్రి కిషన్ రెడ్డికి, ముఖ్యమంత్రి స్టాలిన్‌కి లేఖ రాశారు. ఇటీవల కేంపస్‌లో ఆందోళనల కారణంగా ఏప్రిల్ 6వరకు తరగతులను రద్దు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ పాకల రామదాస్ ఒక ప్రకటన చేశారు.

వేధింపులపై చర్యలు తీసుకుంటామని స్టాలిన్ హామీ

కళాక్షేత్రలో లైంగిక వేధింపుల అంశంపై తమిళనాడు అసెంబ్లీ శుక్రవారం దద్దరిల్లింది. ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ హామీ ఇచ్చారు.

కప్పిపుచ్చేందుకు జాతీయ మహిళా కమిషన్ యత్నం!

కేంద్రం ఆధ్వర్యంలో నడిచే కళాక్షేత్రంలో లైంగిక వేధింపుల ఆరోపణలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు విమర్శించారు.

మార్చి 29న క్యాంపస్‌లో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ రాష్ట్ర పోలీసులు సహాయం లేకుండానే పర్యటించడం అనుమానం కలిగిస్తుందని చెప్పారు. లైంగిక వేధింపులు జరుగుతున్నాయని విద్యార్థినులు ఆందోళన చేస్తుంటే వేధింపులు లేవని రేఖాశర్మ ఎలా చెబుతారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కె సెల్వపెరునాథ్‌గై ప్రశ్నించారు. విద్యార్థులను బెదిరిస్తున్నారని, కళాక్షేత్రం, హాస్టల్‌ను మూసివేస్తామని భయపెడుతున్నారని సిపిఐ ఎమ్మెల్యే టి రామచంద్రన్ (తళ్లె) విమర్శించారు.

10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

- పారదర్శకంగా పోస్టులన్నీ భర్తీచేయాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అన్ని ఖాళీ పోస్టులనూ భర్తీ చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించింది. లోక్‌సభకు విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలకు సంబంధించిన శాఖ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదికలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని స్పష్టం చేసింది. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)ని సకాలంలో అమలు చేసేందుకు, ఎన్ఇపిలో 30:1 విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని సాధించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నిటినీ 'సమయ పరిమితి పద్ధతిలో' భర్తీ చేయాలని విద్యా మంత్రిత్వశాఖ (ఎంఒఇ)ని పార్లమెంటరీ ప్యానెల్ కోరింది. విద్యా మంత్రిత్వశాఖ డేటా ప్రకారం, దేశంలోని ఎలిమెంటరీ, ప్రైమరీ, సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 2022 డిసెంబర్ 31 వరకు అన్ని రాష్ట్రాల్లో 62,71,380 పోస్టులు మంజూరయ్యాయని, వాటిలో 9,86,565 (15.7 శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో 7,47,565, సెకండరీ స్థాయిలో 1,46,334, హయ్యర్ సెకండరీ స్థాయిలో 92,666 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కమిటీ తెలిపింది. రిక్రూట్‌మెంటు ప్రక్రియను వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించాలని కమిటీ సిఫార్సు చేసింది. ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, 'గజిబిజిగా' ఉందని కమిటీ తన నివేదికలో పేర్కొంది.

రాష్ట్ర బడ్జెట్‌లో స్వల్ప మార్పులు

- బడ్జెట్ రూ.2.93 లక్షల కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కన్నా రూ.14 వేల కోట్లు అదనంగా పెరిగింది. 2023-24 సంవత్సరానికి అసెంబ్లీలో రూ.2,79,279 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.

అయితే ద్రవ్య వినిమయ బిల్లు సమయంలో ఈ మొత్తం రూ.2,93,339 కోట్లుగా మార్పు చేశారు. ఈ మొత్తంతోనే బడ్జెట్ బిల్లును ఆమోదించారు. ప్రణాళిక, ఆర్థిక శాఖకు సంబంధించిన కేటాయింపుల్లోనే నిధులు పెరిగినందునే ఈ మార్పులు చేసినట్లు తెలిసింది.

- వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ. 91.50 మేర తగ్గిస్తున్నట్లు కేంద్ర చమురు సంస్థలు ప్రకటించాయి. న్యూఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,028కు తగ్గింది. గత నెలలో వాణిజ్య సిలిండర్‌పై 350.50, డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50 మేరకు పెంచిన సంగతి తెలిసిందే.

ప్రమాదాలపై సత్వరమే ఎటిఆర్‌లు

- రైల్వే బోర్డును కోరిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే ప్రమాదాల గురించి రైల్వే బోర్డు చర్యలు తీసుకున్న (యాక్షన్ టేకెన్) నివేదికలను త్వరగా సమర్పించాలని, అందుకోసం నిర్ణీత కాలపరిమితిని నిర్దేశించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. రూల్స్, కోడ్‌లు, మాన్యువల్స్‌లో రైల్వే ఏకపక్ష మార్పులను నివారించాలని కమిటీ పేర్కొంది. లోక్‌సభలో రవాణా, పర్యాటకం, సాంస్కృతిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన రిపోర్టులో రైల్వే భద్రతా కమిషన్ అంశంపై రైల్వే బోర్డు యాక్షన్ టేకెన్ రిపోర్టులను (ఎటిఆర్‌లు) సమర్పించడానికి నిర్ణీత కాలపరిమితి ఉండాలని పేర్కొంది. ప్రమాదాలకు గల కారణాలను పరిశోధించే ప్రక్రియను, అటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా, దాని ఫలితంగా ఆస్తి, మానవ ప్రాణాలకు నష్టం జరగకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజ్యసభ సభ్యుడు వి విజయసాయిరెడ్డి నేతృత్వంలోని కమిటీ పార్లమెంటులో సమర్పించిన నివేదికలో 2013-14లో జరిగిన ప్రమాదాల్లో రైల్వే మంత్రిత్వశాఖ నుండి 15 ఎటిఆర్‌లు ఇప్పటికీ రైల్వే బోర్డులో పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఎటిఆర్‌లను సమర్పించడంలో విపరీతమైన జాప్యం ప్రమాద పరిశోధనల మొత్తం ప్రయత్నాన్ని అడ్డుకుంటుందని కమిటీ అభిప్రాయపడింది. అందువల్ల రైల్వే బోర్డు ఎటిఆర్‌లను సమర్పించే విధానాన్ని క్రమబద్ధీకరించాలని కమిటీ పేర్కొంది. ఇండియన్ రైల్వే చట్టం, మాన్యువల్స్ మొదలైన వాటిలో మార్పులు చేస్తూ రైల్వే మంత్రిత్వశాఖ, రైల్వే భద్రతా కమిషన్‌తో సంప్రదింపులు జరపాలని, రైల్వే భద్రతా కమిషన్ స్వయం ప్రతిపత్తిని కొనసాగించాలని కమిటీ సూచించింది.

రుతుస్రావ ఆరోగ్య పథకాల బాధ్యత రాష్ట్రాలదే

- సుప్రీంలో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ : యుక్తవయసులోని బాలికలకు రుతుస్రావ సమయంలో పరిశుభ్రతను మెరుగుపరుచుకోవడానికి సంబంధించి చర్యలు తీసుకోవడానికి కట్టుబడి వున్నామని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. ప్రజారోగ్యమనేది రాష్ట్ర అంశమైనందున ఆయా ఆరోగ్య సంరక్షణా సేవలు అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసింది. దేశవ్యాప్తంగా బాలికలకు అవసరమైన వనరులను అందుబాటులో వుంచుతామని, వారికి అవగాహనా, శిక్షణా క్యాక్రమాలు కూడా చేపడతామని తెలిపింది. ఇందుకు సంబంధించిన పథకాల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. ఇటువంటి విధానాల అమల్లో ముందుండాల్సింది ఆయా రాష్ట్రాలు, సంస్థలేనని తెలిపింది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతుల వరకు ప్రభుత్వ పాఠశాల్లో చదివే బాలికలకు శానిటరీ పాడ్స్‌ను ఉచితంగా అందజేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత జయా థాకూర్ పిల్ వేశారు. దానిపై కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది.

కుల రక్కసిపై పోరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యత చాలా ఉందని స్టాలిన్ చెప్పారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం, లౌకిక విలువలు, సమానత్వం, సోషలిజం సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు వైకోమ్ కూడలిలోని పెరియార్ స్మారక చిహ్నం వద్ద ఆయన పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ, టికె మాధవన్, మన్నత్ పద్మనాభన్ స్మారక చిహ్నాల వద్ద, కుంజప్పి, బాహులేయన్, గోవిందపణికర్, అమచాడి తేవన్, రామన్ ఇలయత్ స్మారకాల వద్ద ఇద్దరు సిఎంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ మంత్రి వివన్ వాసవన్ అధ్యక్షత వహిస్తారు.

పునరుజ్జీవనోద్యమం వ్యక్తి-కేంద్రీకృత పోరాటం కాదని వైకోమ్ సత్యాగ్రహం నిరూపించింది: విజయన్

వైకోమ్ సత్యాగ్రహం అసాధారణమైన పోరాటమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ వైకోమ్ సత్యాగ్రహం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పునరుజ్జీవనోద్యమ పోరాటాలు ఒక్క మలుపులో జరగవని అన్నారు. వైకోమ్ సత్యాగ్రహం పునరుజ్జీవనోద్యమం వ్యక్తి-కేంద్రీకృత పోరాటం కాదని నిరూపించిందన్నారు. ఇది సామాజిక, రాజకీయ ఉద్యమం అని అన్నారు. కేరళ, తమిళనాడు పోరాటాల వేదికల్లో పాలుపంచుకునే సాంప్రదాయాన్ని కొనసాగిస్తామని అన్నారు. తమిళనాడులో ద్రవిడ ఉద్యమాన్ని సజీవంగా ఉంచేందుకు స్టాలిన్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వైకోమ్ సత్యాగ్రహం తమిళనాడు గర్వించదగ్గ పోరాటమని అన్నారు. వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాలకు తమిళనాడు ముఖ్యమంత్రి హాజరు కావడం విశేషమని చెప్పారు.. ఇలాంటి పోరాటాలకు నాయకత్వం వహించిన తమిళనాడు, కేరళ రాష్ట్రాలు వైకోమ్ సత్యాగ్రహం సమైక్య సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ ఐక్యత కొనసాగుతుందని, దేశాన్నే మార్చే ప్రగతికి ఈ ఐక్యత దోహదపడుతుందని విజయన్ అన్నారు. మన దేశ ప్రగతికి ఆటంకం కలిగించే శక్తులను ఓడించాలని చెప్పారు. చిన్న చిన్న అభిప్రాయ భేదాలను పక్కన పెట్టాలని అన్నారు. దేశాన్ని మత రాజ్యంగా మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి తీసుకురావాలనే ఎత్తుగడలు జరుగుతున్నాయని, దీన్ని గుర్తించగలగాలని చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు నేడు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే శక్తిగా మారాలని విజయన్ అన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైకోమ్ సత్యాగ్రహ చరిత్రను ఎప్పటికీ గుర్తుచేసే స్మారక చిహ్నాన్ని ప్రభుత్వం నిర్మిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

మహారాజ శ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో..
I.P 32/2018
బొమ్మిశెట్టి శివ ఆంజనేయులు. ..పిటిషనర్.
AND
గుండా నారాయణరావు & వగైరాలు...రెస్పాండెంట్స్.
To,
R1) గుండా నారాయణరావు,వ్యాపారం, దివ్య ఫార్మసీ, డి.నెం 7-2-32/1 నరసరావుపేట.
R2) ఎన్.సురేంద్రబాబు, లక్ష్మీ బాలాజీ మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్, డి.నెం 10-19 నరసరావుపేట.
R3) ఎన్. సురేష్ బాబు, మదిరిమా ఫార్మసీ, డి.నెం 7-4-68, నంబూరు బజార్, నరసరావుపేట.
R5) బి.రాంమోహనరావు,బొలిశెట్టి ఫార్మసీ, డి.నెం 5-9-69/1,గడియార స్తంభం దగ్గర, నరసరావుపేట.
R8) పి.కోటేశ్వరరావు, రాఘవేంద్ర మెడికల్ సర్జికల్, డి.నెం 5-4-10, పాత పల్నాడు బస్టాండ్ నరసరావుపేట.
R15) బి.శ్రీనివాసరావు, బాలాజీ మెడికల్స్ ఏజెన్సీస్,డి.నెం 10-4-16, అచ్చిరెడ్డి కాంప్లెక్స్, నరసరావుపేట.
R16) పి.ప్రసాదరావు, ఎస్.వి మెడికల్స్, డి.నెం 7-4-93, 1 టౌన్, విజయవాడ సిటీ.
R17) కె.వి రామాంజనేయులు, మా ఫార్మసీ, డి.నెం 7-4-68 కరూర్ వైశ్యా బ్యాంక్ దగ్గర, విజయవాడ సిటీ.
R18) ఎస్.శ్రీనివాసరావు, రాజేశ్వరి మెడికల్స్, భవానిపురం, విజయవాడ సిటీ.
R20) భవనాసి సత్యనారాయణ s/o వెంకట్రావు, డి.నెం 5-9-69 సత్తెనపల్లి రోడ్, నరసరావుపేట.
R23) ఆత్మకూరి లక్ష్మీనారాయణ, s/o కోటేశ్వరరావు, వీణ మెడికల్స్,డి.నెం 4-1-7 మల్లమ్మ సెంటర్, నరసరావుపేట.
R26) షేక్ మీరావలి S/o ఖాజావలి, ఆర్.ఎం.పి డాక్టర్, గుండాలపాడు గ్రామం,ఫిరంగిపురం మండలం.
పై నెంబర్ ఐ.పి దావాలో మీకు ఎన్నిసార్లు ఐ.పి నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపర్ నోటీస్ ద్వారా తెలియజేయడమైనది. ది. 13-04-2023 వ తేదీ వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.
ఇట్లు.
ఎ. అజయ్ బాబు,
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

రికవరీ ఆఫీసర్-II వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com
R.P. No.456 of 2018 in OA No. 531 of 2017
వీరి మధ్య: కెనరా బ్యాంక్, చంద్రమౌళీనగర్ బ్రాంచ్, గుంటూరు (కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారి ద్వారా)
మరియు: మెస్సర్స్ టచ్ టెక్స్‌టైల్స్ మరియు ఇతరులు
సవరణ
1. తేది. 22.02.2023 నాటి ప్రొక్లమేషన్ ఆఫ్ సేల్-కమ్-ఇ-వేలం అమ్మకపు నోటీసులో (i) 2వ పేరాలో (CD-2) అయిన శ్రీ జి.వి. కృష్ణ వర్మ, తండ్రి: కన్యాసర కస్పరాజుకు బదులుగా "(CD-2) శ్రీ జి.వి. కృష్ణ వర్మ, తండ్రి: జి. మురళీ వర్మ" అని చదవగలరు. (ii) 8వ పేరా తరువాత, హెడింగ్: "ఆస్తి వివరములు", సబ్-హెడింగ్: షెడ్యూల్-బి నందు (ఎ) ఐటమ్ నెం.1లో "పిడుగురాళ్ల గ్రామం వద్ద" బదులుగా "పిడుగురాళ్ల గ్రామం, డి.నెం. 898/1C1" అని చదవగలరు. (బి) ఐటమ్ నెం.2లో డి.నెం. 28/4C" బదులుగా "డి.నెం. 284/C" అని చదవగలరు.
2. సదరు అమ్మకపు నోటీసులో ఇతర వివరములు, నియమ నిబంధనలు మరియు షరతులులో ఏ విధమైన మార్పులేదు.
(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది. 31-03-2023 న జారీచేయడమైనది)
(బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ
BHARATMALA ROAD TO PROSPERITY
బహిరంగ ప్రకటన
ఆర్ సి.లాండ్స్-8/2044/2022, ఆర్ సి.లాండ్స్-8/2045/2022 & ఆర్ సి.లాండ్స్-8/2046/2022 తేది : 28.03.2023
ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని కృష్ణాజిల్లా, బాపులపాడు మండలంలోని బొమ్ములూరు, కానుమోలు (పెరికీడు), వీరవల్లి గ్రామాలలో జాతీయ రహదారి నెం .16(5) కలపర్రు నుండి హనుమాన్ జంక్షన్ బైపాస్ లో (కి.మీ 1055.680 నుండి కి.మీ 1060.800) వరకు వున్న విశాలతలో 6 లైన్లు వెడల్పుతో రోడ్డు నిర్మించుట, విస్తరణ, మెయింట్ నెన్సు నిమిత్తం దిగువ షెడ్యూల్ లోని తెలిపిన భూములు మరియు చెట్లు మొదలగు వాటితో సహా భారత ప్రభుత్వం రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ వారి ఉత్తర్వులు యస్ ఓ.నెం.236 (ఇ) తేది.13.01.2023న ప్రకటించ బడిన భారతదేశపు గజిట్ ఎక్స్ట్రా ఆర్డినరి నెంబరు.222 పార్ట్ -2 సెక్షన్ -3 సబ్ సెక్షన్ -ii తేది.13.01.2023న జాతీయ రహదారుల చట్టం 1956 (48/1956) సెక్షన్ -3డి (2) భారత ప్రభుత్వానికి అన్ని విధాలుగా ఋణ విముక్తమై ధారదత్తమైనది. అట్టి భూములతో సంబంధం, ఆసక్తి గల వ్యక్తులు తమ భూములకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్లు, వాటి జెరాక్స్ కాపీలు, పట్టాదారు పాస్ పుస్తకములు, టైటిల్ డీడ్స్ కట్టడములు ఏమైనా ఉన్నచో వాటి అప్రోవుడ్ ప్లాన్లు, పన్ను అస్సెస్మెంట్ మరియు పన్ను రసీదుతో స్వయంగా గాని లేక ప్రతినిధి ద్వారా గాని లేదా న్యాయవాది ద్వారా గాని కాంపిటేంట్ ఆథారిటీ మరియు జాయింట్ కలెక్టర్ (భూసేకరణ) కృష్ణా, మచిలీపట్టణం వారి ఎదుట క్రింద తెలిపిన తేదిలో హాజరై ఆయా భూములతో తమకు గల సంబంధిత హక్కులను ప్రకటించ వలసినదిగా కోరడ మైనది.
జాతీయ రహదారుల చట్టం 1956 (48/1956) సెక్షన్ 3జి (3) క్రింద జారీ చేయడమైనది.

జిల్లా పేరు	మండలం పేరు	గ్రామము పేరు	అవార్డు విచారణ జరుగు స్థలం	తేది మరియు సమయం
కృష్ణా జిల్లా	బాపులపాడు	బొమ్ములూరు, కానుమోలు (పెరికీడు), వీరవల్లి	కృష్ణా కలెక్టర్ వారి కార్యాలయం, మచిలీపట్నం	తేది:11.04.2023 ఉదయం: 11.00

షెడ్యూల్
మండలము : బాపులపాడు గ్రామము : బొమ్ములూరు

క్ర. సం	జిల్లా పేరు	మండలము పేరు	గ్రామము పేరు	సర్వే నెం	భూమి వివరము	విస్తీర్ణము చ.మీలో	విస్తీర్ణము హెక్టార్లలో	పట్టాదారు మరియు అనుభవదారు	కట్టడములు మరియు చెట్లు
1	కృష్ణా	బాపులపాడు	బొమ్ములూరు	150-2B2	ప్రైవేటు	1006.00	0.1006	మునునూరు శేషగిరి రావు	ఖాళీ స్థలము
				మొత్తం		1006.00	0.1006		

మండలము : బాపులపాడు గ్రామము : కానుమోలు (పెరికీడు)

క్ర. సం	జిల్లా పేరు	మండలము పేరు	గ్రామము పేరు	సర్వే నెం	భూమి వివరము	విస్తీర్ణము చ.మీలో	విస్తీర్ణము హెక్టార్లలో	పట్టాదారు మరియు అనుభవదారు	కట్టడములు మరియు చెట్లు
1	కృష్ణా	బాపులపాడు	కానుమోలు (పెరికీడు)	504-2	ప్రైవేటు	1173.63	0.117363	1.మునుపర్తి సత్యనారాయణ 2.మునుపర్తి రంగమ్మ 3.నర్రా మహేష్ 4.తట్టి మాణిక్యం 5.శ్రీనివాస రావు 6.జోగి నాగరత్నం	ఖాళీ స్థలము
2				504-3A	ప్రైవేటు	121.00	0.0121	1.గొల్లపూడి శ్రీనివాస బాబు 2.గొల్లపూడి వేణు బాబు	
				మొత్తం		1294.63	0.129463		

మండలము : బాపులపాడు గ్రామము : వీరవల్లి

క్ర. సం	జిల్లా పేరు	మండలము పేరు	గ్రామము పేరు	సర్వే నెం	భూమి వివరము	విస్తీర్ణము చ.మీలో	విస్తీర్ణము హెక్టార్లలో	పట్టాదారు మరియు అనుభవదారు	కట్టడములు మరియు చెట్లు
1	కృష్ణా	బాపులపాడు	వీరవల్లి	371-3B2A	ప్రైవేటు	121.00	0.0121	1. షేక్ నాగూర్ బీ 2. సాలుమూరు పార్వతి	ఖాళీ స్థలము
				మొత్తం		121.00	0.0121		

సం/- డా. అపరాజిత సింగ్ శిన్ శిన్ వార్, ఐ.ఏ.ఎస్.,
కాంపిటెంట్ అథారిటీ(యల్ .ఎ) N H-16
మరియు జాయింట్ కలెక్టర్, కృష్ణా, మచిలీపట్నం.

మిత్రద్రోహి

ఒక ఊరిలో రాజు, సోము అనే ఇద్దరు స్నేహితులుండేవారు. సోము అత్యాశ పరుడు. కొన్ని రోజుల తర్వాత స్నేహితుల మధ్య చిన్నపాటి వివాదాలు వచ్చి విడిపోయారు. రాజు బతుకుతెరువు కోసం చిరు వ్యాపారం ఏదైనా చేసుకోవాలని అనుకున్నాడు. అప్పుడు బాగా ఆలోచించి పక్కనే నగరానికి కుటుంబంతో వెళ్లాడు.

అక్కడ జనం, పిల్లలు ఎక్కువగా ఇష్టపడే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెడితే మంచి లాభం వస్తుందని ఆశపడ్డాడు. వ్యాపారం ప్రారంభించాడు. రాజు వంటలు బాగా చేసేవాడు. కొంత కాలానికే రాజు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు మంచిపేరు వచ్చింది. అది చూసిన సోము ఎలాగైనా రాజుకి పోటీగా వ్యాపారం పెట్టాలనుకున్నాడు. తగినంత డబ్బు లేకపోయినా, అప్పుచేసి, తక్కువ ధరలకు దొరికే కల్తీ పదార్థాలతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టాడు. తిన్న వారంతా కల్తీ పదార్థాలని గ్రహించడం వల్ల సోము సెంటర్‌కు జనం వచ్చేవారు కాదు. ఫుడ్ సెంటర్‌కి వచ్చిన వారంతా అనారోగ్యానికి గురికాసాగారు. ఊరిపెద్దలు సోము గురించి తెలిసి, అతని వ్యాపారాన్ని బట్టబయలు చేయాలనుకున్నారు. పక్కన ఉన్న చెట్టు వెనక నిలబడి, కల్తీ వస్తువులతో పదార్థాలను తయారు చేయటం చూశారు. తర్వాత ఊరిప్రజలంతా కలిసి నిర్ణయం తీసుకొని సోము వ్యాపారాన్ని బంద్ చేయించారు. సోము కూడా తన తప్పును తెలుసుకొని, ఊరి ప్రజలందరిని క్షమించమని కోరాడు. కొన్ని రోజులకు రాజు తన ఫుడ్ సెంటర్‌లో సోముకు ఉపాధి కల్పించి, ఇద్దరూ స్నేహితులుగా ఉండసాగారు. తాను చెడు కోరినా పట్టించుకోకుండా తన గురించి ఆలోచించి ఉద్యోగం ఇప్పించిన రాజుకు, సోము కృతజ్ఞతలు తెలిపాడు.

ధారావత్ రాహుల్
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మాల్తుమ్మెద,
కామారెడ్డి.

సరైన నీడ ఏది?



చిన్నారులూ, పప్పీ మార్కెట్ నుంచి ఇంటికి సైకిల్ తొక్కుకుంటూ వెళుతోంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 2

నేను గీసిన బొమ్మ



వై. గిరితిక, 4 వ తరగతి,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెన్నలపాడు,
తొట్టంబేడు మండలం
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పరీక్షల వేళ.. ఇలా సిద్ధమవ్వండి..

రేపటి నుండి పదో తరగతి పరీక్షలు జరగబోతున్నాయి. ఇప్పటివరకు స్కూలు ఆవరణలోనే పరీక్షలు రాసిన విద్యార్థులు మొదటిసారి వివిధ పాఠశాలల్లో పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు. లాక్‌డౌన్‌లో పాఠశాలలు మూతబడి రెండేళ్ల విద్యా సంవత్సరం వెనుకబడిన ఈ విద్యార్థులపై ఈ పరీక్షల ఒత్తిడి ఉండనే ఉంటుంది. అయితే సరైన సమయ పాలన, పాఠ్యాంశాల అభ్యసనం, విశ్రాంతి, ఆహారం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఒత్తిడి నుంచి దూరం కావొచ్చు. ఈ సమయంలో పిల్లలు ఒత్తిడిని ఎలా అధిగమించవచ్చు? తల్లిదండ్రులు ఏం చేయాలి? పరీక్షా సమయంలో ప్రశ్నాపత్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ముందుగా ఏయే ప్రశ్నలు రాయాలి వంటి విషయాలపై అవగాహన అవసరం.

పిల్లలూ, మీరు ఎటువంటి ఒత్తిడీ లేకుండా ప్రశాంతంగా ఉండాలి. ఏడాదంతా చదివిన, రాసిన పాఠాలకే మరోసారి మీరు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. కొత్తగా ఏమీ ఉండవు. పైగా మీరు ఇప్పటికే ఎన్నోసార్లు మీ, మీ పాఠశాలల్లో పరీక్షలు రాసేవుంటారు. ఈసారి బయటి పాఠశాలలో రాయాలి అంతే..

విశ్రాంతి తీసుకోండి..

పరీక్షలని రాత్రుళ్లు ఎక్కువసేపు మేల్కొని ఉండకండి. నిద్రలేమి వల్ల కలిగే ఒత్తిడి పరీక్షా సమయంలో ఉంటుంది. కాబట్టి కచ్చితంగా నిర్ణీత సమయానికే నిద్రపోండి. అలాగే ఉదయం వేళ కూడా గంట, గంటన్నరకు మించి చదవకండి.. ఇంకా పరీక్షకు వెళ్లే సమయం వరకు పుస్తకాలు ముందేసుకోకండి.

ప్రయాణం వేళ..

పదో తరగతి విద్యార్థుల కోసం ఆర్‌టిసి వారు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నారు. ముందుగా బయల్దేరటం మంచిది. అవకాశం ఉంటే సొంత వాహనాల్లో, పాఠశాల బస్సుల్లో వెళ్లడం మంచిది. సమయానికి చేరుకుంటారు. ఒత్తిడి ఉండదు. అలాగే ప్రయాణం వేళ అస్సలు చదవకండి. పరీక్ష హాలుకు వెళ్లే ముందు వరకు కూడా కొంతమంది తెగ చదివేస్తుంటారు. అలా చేయడం మంచిది కాదు. సాధ్యమైనంత వరకు పరీక్షా సమయానికి ముందు చాలా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించండి.

తల్లిదండ్రులూ, మీరివి గుర్తుంచుకోండి..

పిల్లలపై మార్కుల ఒత్తిడి, పరీక్షల భయం కలిగించేది తల్లిదండ్రులే. పక్కింటి పిల్లలు పరీక్షలప్పుడు ఎక్కువ సమయం చదివారని.. ఫలానా పరీక్ష చాలా కష్టంగా వస్తుందని, కాబట్టి బాగా చదవాలని.. బంధువుల పిల్లల కంటే నీకే ఎక్కువ మార్కులు రావాలని.. ఇలా రకరకాల కారణాలతో పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. కాని అలా చేయకండి. వారిలో లేనిపోని భయాలు కలిగించకండి. ఒత్తిడి తగ్గించేలా వేళకు నిద్ర, ఆహారం తీసుకునేలా చూడండి. ఏడాదంతా స్కూల్లో చదివిన పాఠాలే పరీక్షల్లో వస్తాయని, భయపడకుండా రాయమని ధైర్యం చెప్పండి. పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకునేలా సౌకర్యాలు కల్పించండి. బాగా చదివే పిల్లలను, చదువులో వెనకబడిన పిల్లలను పోలికలతో వేరు చేయకండి. ఎవరి సామర్థ్యం బట్టి వారు పరీక్షలు రాస్తారు. అందరూ వంద మార్కులు తెచ్చుకోలేరు కదా!

గతంలో అయితే ఒక్కో సబ్జెక్టుకు రెండేసి పేపర్లు రాసేవారు. కాని రెండేళ్లుగా ఒకే పేపరు రాసే విధానం ప్రారంభించారు. దీనివల్ల ఎక్కువ సిలబస్‌ను పిల్లలు అధ్యయనం చేయాల్సి వస్తుంది. తెలుగు, సంస్కృతం సబ్జెక్టు ఉన్న వారికి మాత్రమే మొదటి భాషా పరీక్షకు గాను రెండు అవకాశాలు ఇచ్చారు. సాధారణ విద్యార్థులంతా తెలుగు, హిందీ, ఇంగ్లీషు, లెక్కలు, సైన్సు, సోషలు కలిపి ఆరు పరీక్షలు రాయాల్సి వుంటుంది. ఆయా సబ్జెక్టు టీచర్లు పరీక్షలను ఎలా సులభంగా రాయాలో కొన్ని సూచనలు ఇస్తున్నారు.. ఒకసారి చూడండి..

లెక్కలంటే భయం వద్దు..

లెక్కల పరీక్షపై లేనిపోని భయాలు పెట్టుకోవద్దు.. ముందు ప్రశ్నాపత్రం తీసుకొని ఓ పదిహేను నిమిషాలు బాగా చదవండి. మీకు బాగా వచ్చిన వాటిని ముందుగా రాయండి. అయితే రోమన్ నెంబరు, ప్రశ్న నంబరు కచ్చితంగా రాయాలి. మొత్తం 33 ప్రశ్నల్లో ఒక్క మార్కు, రెండు మార్కులవే 20 ప్రశ్నలు ఉంటాయి. జాగ్రత్తగా అర్థం చేసుకుని రాయడం మొదలుపెట్టండి. బాగా వచ్చినవి ముందుగా రాయడం మొదలుపెడితే మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సమాధానాలు తెలిసినవి ముందుగా, తెలియనవి తరువాత రాయడం ద్వారా అన్ని ప్రశ్నలకు జవాబులు సిద్ధం చేసే వీలుంటుంది.

– ఎస్.రవీంద్రనాథ్, లెక్కల టీచరు.

ఒత్తిడి లేకుండా రాయొచ్చు..

తెలుగు పరీక్ష ఏమాత్రం ఒత్తిడి లేకుండా రాయొచ్చు. 12 మార్కుల గ్రామరుకు అన్ని మార్కులు సంపాదించుకునే వీలుంటుంది. ఈ పరీక్షకు చాయిస్ ఉండదు కాబట్టి అన్ని ప్రశ్నలు రాయాల్సి ఉంటుంది. అలాగే చదువులో వెనుకబడిన విద్యార్థులకు కూడా పాస్ మార్కులు రావాలంటే.. పెద్ద ప్రశ్నలకు నాలుగైదు వరుసల్లోనైనా జవాబులు రాయాలి. సొంతంగా రాయడం అలవర్చుకున్న పిల్లలకు ఇది చాలా సులభంగా ఉంటుంది. లేఖను బాగా చదవడం, రాయడం ప్రాక్టీసు అవ్వాలి. పరీక్ష రాసేటప్పుడు కొట్టివేతలు ఉండకుండా చూసుకోవాలి.

– సిహెచ్ పద్మావతి, తెలుగు టీచరు

ఇన్విజిలేటర్ పిల్లలను అప్రమత్తం చేయాలి..

అన్ని సబ్జెక్టుల్లోకి సైన్సు పరీక్ష ఒత్తిడి పిల్లలపై ఎక్కువగానే ఉంటుంది. భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం మొత్తం కలిపి వంద మార్కులకు రాయాల్సి ఉంటుంది. భౌతిక, రసాయన శాస్త్రాలకు 50 మార్కులు, జీవశాస్త్రానికి 50 మార్కులను నిర్దేశిస్తూ రెండు వేర్వేరు బుక్‌లెట్‌లు ఇస్తారు. బాగా చదివే పిల్లలు కూడా ఇక్కడ తికమక పడే వీలుంటుంది. మీరు ముందుగా ఏ సబ్జెక్టు ప్రశ్నలకు సమాధానాలు రాయాలనుకుంటున్నారో ఆ బుక్‌లెట్‌లోనే రాయాలి. ఒక దాని ప్రశ్న మరొక దాని బుక్‌లెట్‌లో రాయకూడదు. రోమన్ నెంబరు, ప్రశ్న నెంబరు వేసినా ప్రయోజనం ఉండదు. కాబట్టి పిఎస్, ఎన్ఎస్ వేర్వేరుగా సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇన్విజిలేటర్ పై విషయాలపై పిల్లలను అప్రమత్తం చేయాలి. కంగారులో పిల్లలు ఒక బుక్‌లెట్‌లో వేరొక సబ్జెక్టు ప్రశ్న రాసే ప్రమాదముంది. కాబట్టి ఆయా పరీక్ష హాలు ఇన్విజిలేటర్ కాస్తంత శ్రద్ధ పెట్టి పిల్లలు తప్పుగా రాయకుండా చూడాలి. అలాగే బొమ్మలు వేసినప్పుడు భాగాలు కచ్చితంగా రాయాలి.

– సి. మంజుల, సైన్సు టీచరు.

1,2 పాఠాలు చదివినా పాస్ గ్యారంటీ..

హిందీ పరీక్ష రాసేటప్పుడు అన్ని ప్రశ్నలకు మీకు సమాధానాలు వచ్చి వుంటే వరుసగా ఒక్కొక్క ప్రశ్నకు సమాధానాలు రాయాలి. చాలా సులభంగా ఎక్కువ మార్కులు తెచ్చుకునే సబ్జెక్టు ఇది. చదువులో వెనుకబడిన విద్యార్థులైతే 'ఛుట్టీ పత్ర్', 'ప్యాసేజ్ ప్రశ్నలు', వ్యాసాలు రాయడం ముందుగా రాసేస్తే.. మిగిలిన సమయంలో గ్రామర్‌పై దృష్టి పెట్టవచ్చు. అలాగే 1, 2 పాఠాలు బాగా చదువుకున్నా పాస్ గ్యారంటీ ఉంటుంది. సరైన మార్గదర్శకాలు పాటిస్తే.. సామర్థ్యంతో సంబంధం లేకుండా పిల్లలందరూ పరీక్షలో ఉత్తీర్ణులు కాగలరు.

– సాహేరా సుల్తానా, హిందీ టీచరు.

సులభంగా రాయొచ్చు..

సోషల్ సబ్జెక్టును చాలా సులభంగా రాయొచ్చు. ప్రశ్నాపత్రం బాగా చదివిన తరువాతే జవాబులు రాయడానికి సిద్ధమవ్వాలి. ముందు బాగా వచ్చిన వాటిని రాస్తే ఆ తరువాత సమయంలో రానివి ఆలోచించుకోని రాసు కోవచ్చు. చదువుకునేటప్పుడు గతంలో బాగా వచ్చినవే చదువుకోవాలి. కొత్త వాటి .జోలికి వెళ్లొద్దు. మ్యాప్ పాయింట్‌లో ఎక్కువ మార్కులు స్కోర్ చేసే వీలుంటుంది. బాగా సిద్ధమవ్వాలి.

– ముత్యాల రాజు, సోషల్ టీచర్,

టెక్స్ట్ బుక్ చదవాలి

ఇంగ్లీషు పరీక్షకు సిద్ధమయ్యే పిల్లలు టెక్స్ట్ బుక్ బాగా చదవాలి. అందులో ఉండే గ్రామర్, వకాబులరీ బాగా నేర్చుకోవాలి. అలాగే పరీక్ష రాసేటప్పుడు మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు జవాబులు రాయకూడదు. ఆప్షన్స్ రాయాలి. పారాగ్రాఫ్ ప్రశ్నలకు 3వ పర్సన్‌లో జవాబులు రాయాలి. క్రియేటివ్ రైటింగ్స్, లెటర్ రైటింగ్ బాగా నేర్చుకోవాలి. ఎక్కువ శాతం మార్కులు వచ్చేది ఇక్కడే.

– భాస్కర్, ఇంగ్లీషు టీచరు.

ఘనంగా 'నాట్స్' సంబరాలు

ఆకట్టుకున్న కళారూపాలు, జానపద నృత్యాలు

ప్రజాశక్తి– ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో విశాఖలోని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం అమెరికా తెలుగు జానపద సంబరాలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. కళారూపాలు వెల్లివిరిశాయి. జానపద నృత్యాలు చూపరులను కట్టిపడేశాయి. ముఖ్యంగా మహిళా కళాకారులు 'సువ్వి సువ్వి' పాటకు చేసిన నృత్యం, డప్పులతో రఘు బృందం చేసిన నృత్యం వీక్షకుల మెప్పుపొందాయి. కళాకారులను అతిథులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సంబరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు, కవి డాక్టర్ పెదవీరరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు తెలుగు భాషను టివిల్లో, సోషల్ మీడియాలో అపహాస్యం చేస్తున్న తరుణంలో అమెరికాకు చెందిన నాట్స్ తెలుగుపై మక్కువతో జానపద సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జానపద కళలను ప్రజలు ఆదరించాలని కోరారు. నాట్స్ సమన్వయకర్త శ్రీధర్ అప్పసాని మాట్లాడుతూ ఈ ఏడాది మే 26, 27 తేదీల్లో అమెరికాలోని న్యూజెర్సీలో తెలుగు సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాట్స్ అధ్యక్షులు బాపు నూతి మాట్లాడుతూ గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ, శ్రీమాతా కళాపీఠంతో కలిసి ఈ సంబరాలను నాట్స్ నిర్వహిస్తోందన్నారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని గుర్తు చేస్తూ గ్రామాల అభివృద్ధికి, కళలను పెంపొందించడానికి తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్లో సంస్థ కార్యదర్శి యార్లగడ్డ వెంకన్న చౌదరి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఎంతోమంది జానపద కళాకారులున్నారని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటక రంగంలో విశేష సేవలందించిన పద్మశ్రీ ఎడ్ల గోపాల్, ప్రొఫెసర్ మీగడ రామలింగం, శ్రీమాతా సంస్థ అధినేతలు బిఎన్.మూర్తి, పల్లి నాగభూషణరావు, ప్రజాకవి దేవిశ్రీ, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

జానపద నృత్యంతో ఆకట్టుకున్న మహిళా కళాకారులు

ప్రక్షాళన నాటకం

అలరిస్తున్న జాతీయ నాటిక పోటీలు

ప్రజాశక్తి.చిలకలూరిపేట/యడ్లపాడు (పల్నాడు జిల్లా)

పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయ స్థాయి నాటిక పోటీలు పల్నాడు జిల్లా యడ్లపాడులోని సుందరయ్య కళా ప్రాంగణం, ఎం.వి.చౌదరి కళావేదికలో రెండవ రోజైన శనివారం కొనసాగాయి. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత న్యూస్టార్ మోడరన్ ఆర్ట్స్ థియేటర్ విజయవాడ వారి కపిరాజు నాటిక ప్రదర్శించబడింది. డాక్టర్ ఎంఎస్ చౌదరి రచించిన నాటకానికి పి దివాకర్ ఫణింద్ర దర్శకత్వం వహించారు. వాలి, సుగ్రీవుల కథాంశంగా కపిరాజు నాటికను కళాకారులు ప్రదర్శించారు. చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించిన ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు బృందం 'ప్రక్షాళన' నాటికను ప్రదర్శించింది. శ్రీమతి సత్యవతి నాటకీకరణ, వల్లూరి శివ ప్రసాదరావు దర్శకత్వం వహించిన అరవిందా ఆర్ట్స్ వారి 'వెండి అంచులు' నాటిక ప్రదర్శించారు. ఆదివారం ముగింపు సభకు మళయాళ సిని దర్శకులు, కేరళ ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ శాజీ నీలకంఠన్ కరుణ, సినీ దర్శకులు సి ఉమామహేశ్వరరావు హాజరవుతారని కమిటీ నిర్వాహకులు ముత్తవరపు సురేష్ తెలిపారు. ఈసందర్భంగా నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణను కళాకారులు ఘనంగా సన్మానించారు.

మే 31న మహేష్‌బాబు సినిమా అప్‌డేట్

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తన 28వ సినిమా చేస్తున్నారు. హారికా హాసిని క్రియేషన్స్ సంస్థ పై భారీ స్థాయిలో నిర్మితం అవుతున్న ఈ మూవీకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 13న విడుదల చేయనున్నారు. మే 31న సూపర్ స్టార్ కృష్ణ జన్మదినం రోజున తమ మూవీ నుండి నెక్స్ట్ అప్ డేట్ రానుంది అని ట్విట్టర్ అకౌంట్‌లో డ్రమ్స్ ఎమోజి పోస్ట్ చేశారు థమన్. దీంతో అదే రోజున టైటిల్ తో పాటు ఫస్ట్ లుక్ టీజర్ కూడా వచ్చే అవకాశం ఉందని ప్రచారం.

మన పని మనం చేసుకోవడమే: శివాత్మిక

జీవిత, రాజశేఖర్ వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు శివాత్మిక. 'దొరసాని', 'రంగమార్తాండ'తో గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో శివాత్మిక ఓ యూట్యూబ్ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక విషయాలను పంచుకుంది. 'రంగమార్తాండలో నాది మెయిన్ లీడ్ కాదు. ఇక్కడ మన పని మనం చేసుకుంటూ పోవడమే మన చేతుల్లో ఉందనే సంగతి స్పష్టమైంది' అంటూ వివరించింది.

పంజాబ్‌ను గెలిపించిన వరుణుడు

బ్యాటింగ్‌లో రాజపక్సే, బౌలింగ్‌లో ఆర్ష్‌దీప్ – కోల్‌కతాపై ఏడు పరుగుల తేడాతో విజయం

మొహాలీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో పంజాబ్ కింగ్స్ జట్టు బోణీ కొట్టింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో పంజాబ్ జట్టు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఏడు పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్‌పై గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 191పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో భాగంగా కోల్‌కతా 16ఓవర్లు పూర్తయ్యేసరికి 7వికెట్లు నష్టపోయి 146పరుగులు చేసింది. ఈ క్రమంలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దీంతో అంపైర్లు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఏడు పరుగుల తేడాతో పంజాబ్ గెలిచినట్లు ప్రకటించారు. వర్షం కారణంగా నిలిచే సమయానికి కోల్‌కతా జట్టు 24బంతుల్లో 46పరుగులు చేయాల్సి ఉండగా.. క్రీజ్‌లో శార్దూల్ ఠాకూర్, సునీల్ నరైన్ ఉన్నారు. కోల్‌కతా బ్యాటర్లలో ఇంప్యాక్ట్ ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్(34) విధ్వంసక ప్లేయర్ అండ్రూ రస్సెల్(35) నితీశ్ రానా(24) మాత్రమే రాణించారు. పంజాబ్ బౌలర్లలో ఆర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు పడగట్టాడు. సామ్ కరన్, నాథన్ ఎల్లిస్, సికిందర్ రజా, రాహుల్ చహర్ తలా ఒక వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆర్ష్‌దీప్ సింగ్‌కు లభించింది. తొలుత పంజాబ్ కెప్టెన్ శిఖర్ ధావన్(40), ఓపెనర్ ప్రభ్‌సింహ్ రానా సింగ్ (23) వికెట్ కీపర్ జితేశ్ శర్మ(21), సికిందర్ రాజా (16) రాణించారు. ఆఖర్లో ఆల్‌రౌండర్ సామ్ కరన్(26), షారుఖ్ ఖాన్(11) బ్యాటింగ్‌లో రాణించడంతో పంజాబ్ 191 రన్స్ చేయగలిగింది. కోల్‌కతా బౌలర్లలో టిమ్ సౌథీ రెండో వికెట్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, ఉమేశ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు..

పంజాబ్‌కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభుసిమ్రన్ (సి)గుర్బాజ్ (బి)సౌథీ 23, ధావన్ (సి)వరణ్ చక్రవర్తి 40, రాజపక్సే (సి)రిక్కీ సింగ్ (బి)ఉమేశ్ 50, జితేశ్ శర్మ (సి)ఉమేశ్ (బి)సౌథీ 21, హసన్ రాజా (సి)నితీశ్ రాణా (బి)నరైన్ 16, సామ్ కర్రన్ (నాటౌట్) 26, షారుక్ ఖాన్ (నాటౌట్) 11, అదనం 4. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 191పరుగులు. **వికెట్ల పతనం:** 1/23, 2/109, 3/135, 4/143, 5/168 **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 4–0–27–1, సౌథీ 4–0–54–2, నరైన్ 4–0–40–1, వరణ్ చక్రవర్తి 4–0–26–1, శార్దూల్ ఠాకూర్ 4–0–43–0,

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: మన్‌దీప్ సింగ్ (సి)సామ్ కర్రన్ (బి)ఆర్ష్‌దీప్ 2, గుర్బాజ్ (సి)ఎల్లిస్ 22, అనుకుల్ రాయ్ (సి)రాజా (బి)ఆర్ష్‌దీప్ 4, వెంకటేశ్ అయ్యర్ (సి)రాహుల్ చాహర్ (బి)ఆర్ష్‌దీప్ 34, నితీశ్ రాణా (సి)రాహుల్ చాహర్ (బి)రాజా 24, రింకూ సింగ్ (సి)రాజా (బి)రాహుల్ చాహర్ 5, ఆండీ రస్సెల్ (సి)రాజా (బి)శామ్ కర్రన్ 35, శార్దూల్ ఠాకూర్ (నాటౌట్) 8, సునీల్ నరైన్ (నాటౌట్) 7, అదనం 6. (16ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 146పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/17, 3/29, 4/75, 5/80, 6/130, 7/138 **బౌలింగ్:** సామ్ కర్రన్ 3–0–38–1, ఆర్ష్‌దీప్ సింగ్ 3–0–19–3, నాథన్ ఎల్లీస్ 3–0–27–1, సికిందర్ రాజా 3–0–25–1, రిషీ ధావన్ 1–0–15–0, రాహుల్ చాహర్ 2–0–12–1, హర్‌ప్రీత్ బ్రార్ 1–0–7–0

ఫైనల్‌కు సింధు

మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ సూపర్–300 మహిళల సింగిల్స్ ఫైనల్లోకి పివి సింధు ప్రవేశించింది. శనివారం జరిగిన ఉత్కంఠ పోటీలో సింధు 24–22, 22–20పాయింట్ల తేడాతో హో–జియో– మిన్ (సింగపూర్)పై గెలిచింది. తొలి గేమ్‌లో ఇరువురు షట్లర్లు హోరాహోరీగా తలపడగా.. చివర్లో సింధు వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను ముగించింది. ఈ మ్యాచ్ సుమారు 48నిమిషాలసేపు సాగింది. బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో సింధు 11వ స్థానంలో, హో–జియొ–మింగ్ 33వ స్థానంలో ఉన్నారు. ఆదివారం జరిగే ఫైనల్లో సింధు కరోలినా మారిన్–టన్‌జంగ్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి జపాన్‌కే చెందిన నిషిమోటో, సునేయమా ప్రవేశించాడు.

ఐపిఎల్ దృష్ట్యా మెట్రో రైళ్ల సంఖ్య పెంపు

హైదరాబాద్: రాజస్తాన్ రాయల్స్–సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపిఎల్ మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకొని మెట్రో రైళ్ల సంఖ్యను పెంపుదల చేస్తున్నట్లు ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ సంస్థ ప్రకటించింది. రెండేళ్ల తర్వాత హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ జరగనుంది. నాగోల్–అమీర్‌పేట మార్గంలో ఎక్కువ సంఖ్యలో రైళ్లను నడుపనున్నట్లు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఈ సేవలు అందుబాటులో ఉంటాయని ప్రకటించింది. మరోవైపు ఉప్పల్ మ్యాచ్‌కు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాచకొండ సిపి డీఎస్ చౌహాన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాదాపు 1500 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. స్టేడియం లోపల, వెలుపల 340 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని, అలాగే జాయింట్ కమాండ్, కంట్రోల్ రూంను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. మధ్యాహ్నం 12.30గం॥ల నుంచే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామని తెలిపారు.

బ్యాటింగ్‌లో మయర్స్, బౌలింగ్‌లో వుడ్

ఢిల్లీపై 50 పరుగుల తేడాతో లక్నో గెలుపు

లక్నో: మరో మ్యాచ్‌లో లక్నో జట్టు 50 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత మయర్స్ (73పరుగులు) బ్యాటింగ్‌లో రాణించడంతో లక్నోజట్టు 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 193పరుగుల భారీస్కోర్ చేసింది. ఆ తర్వాత బౌలింగ్‌లో మార్క్‌వుడ్(5/14) బౌలింగ్‌లో మెరవడంతో ఢిల్లీ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్ల నష్టానికి 143పరుగులే చేయగల్గింది. మయర్స్ కేవలం 38బంతుల్లో 2ఫోర్లు, 7సిక్సర్లుతో 73 పరుగులు చేశాడు. చివర్లో పూరన్(38), బడోనీ(18) చెలరేగారు.

ఐపిఎల్‌లో నేడు..

హైదరాబాద్ × రాజస్తాన్
(వేదిక: హైదరాబాద్‌లో, మ.3.30గం॥లకు)
బెంగళూరు × ముంబయి
(వేదిక: బెంగళూరు; రా.7.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68